ప్రజాశక్తి

సోపతి

అల్జీమర్స్‌పై ఆస్కార్ కళాఖండం

మార్చి 1, 2015 ఆదివారం అనుబంధం

ఆహారమే ఉద్దీపన

- ఇండొనేషియా కథ చిట్టెలుక - సున్నపు గొయ్యి
- పెళ్ళి - కులం - మహిళ
- హోలి రంగుల కేళి
- గోపి పుస్తకంపై సమీక్ష

హాకింగ్‌లోకి పరకాయ ప్రవేశం

కాలబిలాల రహస్యాన్ని కనుగొన్న శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ పాత్రని పోషించడం అంత సులువు కాదు. అయినప్పటికీ హాకింగ్ జీవిత చరిత్రని తెర మీద కెక్కించాలనుకున్న నిర్మాతలకు ఎడ్డీ తారసపడ్డాడు. హాకింగ్ పాత్రను అతడు మాత్రమే పోషించగలడని తలపోశారు. వారిని నిరాశపరచలేదు ఎడ్డీ రెడ్‌మాన్. 1942లో జన్మించిన హాకింగ్‌ని 1982లో జన్మించిన ఎడ్డీ ఆవాహన చేసుకున్నాడు. నటించడం కాదు ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసిన విలక్షణ సృజనశీలి ఎడ్డీ. ఈ చిత్రాన్ని తిలకించి తనను తాను చూసుకున్నట్టుగా ఉందని హాకింగ్ అన్నారంటే నటునిగా ఎడ్డీ ఎంతటి ప్రతిభావంతుడో అర్థం చేసుకోవచ్చు. తొలి రోజుల్లో రంగస్థలం మీద నటించి, నటనకు సంబంధించిన పాఠాల్ని, మెళకువల్ని నేర్చుకున్న ఎడ్డీ ఇవాళ ఆస్కార్ విజేత.

ప్రముఖ నటుడు, గాయకుడు, మోడల్ అయిన ఎడ్డీ కేంబ్రిడ్జ్ ట్రినిటీ కాలేజీ నుంచి హిస్టరీ ఆఫ్ ఆర్ట్‌లో డిగ్రీ చదివాడు. మొదట్లో నాటకాలు, టీవీ సిరీస్‌లో నటించేవాడు. అతడు నాటకాల్లో చూపిన ప్రతిభకు గాను అనేక అవార్డులు కూడా పొందాడు. ఈ క్రమంలోనే అతడు సినిమాల్లో అడుగుపెట్టాడు. 'లైక్‌మైండ్స్' అతడి మొదటి సినిమా. ఆ తరువాత వెనుతిరిగి చూడలేదు. ది గుడ్ షెఫర్డ్, ఎలిజబెత్: ది గోల్డెన్ ఏజ్, మై వీక్ విత్ మారిలిన్, లెస్ మిసరబుల్స్ వంటి చిత్రాల్లో నటించి మంచి పేరు గడించాడు. 2014లో 'థియరీ ఆఫ్ ఎవెరి థింగ్'లో ప్రధాన పాత్ర పోషించి జనాన్ని విస్మయపరచాడు. ఆ సినిమాలో నటించినందుకే అతడికి బెస్ట్ యాక్టర్‌కిచ్చే ఆస్కార్ అవార్డు లభించింది. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా తీశారు. ఈ సినిమాలో స్టీఫెన్ హాకింగ్‌కి ఆయన మొదటి భార్య జేన్ తో ఉన్న సంబంధాలను, అలాగే ఆయనకు వచ్చిన అరుదైన మోటార్ న్యూరాన్ డిసీజ్ (ఎఎల్ఎస్)ను వారు ఏవిధంగా ఎదుర్కొన్నారనే విషయాన్ని అద్భుతంగా చూపారు. లండన్‌లో ఈ సినిమాను చూసిన స్టీఫెన్ హాకింగ్ ఆనందంతో కళ్ళనీళ్ళపర్యంతమయ్యారు. సినిమా అయిపోయి హాల్లో లైట్లు వెలిగిన తరువాత ఆయన కన్నీటిని ఒక నర్స్ తుడుస్తూ కనిపించింది. ఈ సినిమాను ఆయన అత్యంత వాస్తవమైనదిగా పేర్కొన్నారు. అంతేకాదు డైరెక్టర్ జేమ్స్ మార్స్, స్క్రీన్ ప్లే రైటర్ ఆంథోని మెక్‌కార్టెన్‌తో కలిసి ఓ బార్‌లో ఒక టీస్పూన్ చాంపేన్‌ను సిప్ చేసి సెలబ్రేట్ చేసుకున్నారు. సినిమా చూస్తున్నప్పుడు కొన్ని విషయాల్లో తనను తాను మరొకసారి చూసుకున్నట్లు ఉందని హాకింగ్ సినిమా డైరెక్టర్‌కి పంపిన ఈ మెయిల్‌లో పేర్కొన్నారు.

అలాగే ఎడ్డీకి ఆస్కార్ వచ్చిన తరువాత సోషల్ మీడియాలో ' నేను ఈ నటుణ్ణి చూసి చాలా గర్విస్తున్నా'నని పోస్ట్ చేశారు. ఇక ఎడ్డీ తనకు హాకింగ్ పాత్ర లభించటం అదృష్టమని, ఈ అవార్డు ఎఎల్ఎస్‌తో ప్రపంచవ్యాప్తంగా బాధపడుతున్న అందరిదీ అని అవార్డు తీసున్న సందర్భంగా చెప్పారు.

■ అంతరంగం

ప్రశ్నల కాలం

రాజుల సొమ్ము రాళ్ళపాలనే సామెత అత్యాధునిక పాలకుల ఏలుబడిలోనూ కనిపిస్తున్న విషాద దృశ్యం. నిజానికి అప్పుడయినా ఇప్పుడయినా అది రాజుల సొమ్ము కాదు ప్రజల సొమ్ము. ప్రజల సొమ్మును ఆనాడు రాజులు వృధా చేశారు. ఇప్పుడు ప్రజలెన్నుకున్న ప్రభుత్వాధినేతలు వ్యర్థం చేస్తున్నారు. ప్రభుత్వ గ్రంథాలయాలకు నిధులు కేటాయించడానికి మనసు రాదు, పుస్తకాలు కొనాలి, గ్రంథాలయాల్ని పటిష్టం చేయాలనే ఆలోచనలు రావు. కానీ మూఢవిశ్వాసాల పెంపుదలకు మాత్రం కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు గానీ గ్రంథాలయాల్ని సందర్శిస్తున్నారా? తెలంగాణ వచ్చాక అఫ్జల్‌గంజ్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీని ఏ మంత్రయినా సందర్శించారా? పుస్తకాల కొనుగోళ్ళ గురించి యోచించారా? గ్రంథాలయాల పటిష్టతకు ఏం చేద్దామని తలపోశారు? తెలంగాణలో అలనాటి ఆంధ్రోద్యమానికి ప్రేరణ గ్రంథాలయాలు, గ్రంథాలయోద్యమాలే. కానీ ఇవాళ తెలంగాణలో గ్రంథాలయాలది దీనావస్థ. రాష్ట్రంలోగానీ, జిల్లాల్లో గానీ గ్రంథాలయ పరిషత్‌లు ఏర్పాటు చేయలేదు. పుస్తకాల కొనుగోళ్ళు నిలిపివేశారు. గ్రంథాలయాలకు రావాల్సిన సెస్సు చెల్లింపుల్ని ఆపేసారు.

ప్రజల్ని చైతన్యం చేస్తామనేవాళ్ళు గ్రంథాలయాలు పుస్తకాలతో కళకళలాడాల్సిన అవసరం గుర్తించకపోతే ఎలా? ఆలయాల్ని అభివృద్ధి పరచడం కన్నా ముందు గ్రంథాలయాల్లో అలుముకున్న చీకటిని తొలగించాలి. ప్రతి గ్రంథాలయం నేటి అవసరాలకు అనుగుణంగా పుస్తకాలతో వెలుగొందాలి. మండల కేంద్రాలన్నిటా గ్రంథాలయాలు సకల సౌకర్యాలతో నెలకొనాలి.

మొత్తం తెలంగాణలో అత్యాధునిక సౌకర్యాలతో ఏకకాలంలో అయిదు వందలమంది చదువుకోడానికి అనువైన గ్రంథాలయం ఒక్కటంటే ఒక్కటీ లేదు. ఇలాంటి విజ్ఞానసౌధం ఒకటి నిర్మిస్తే తెలంగాణ సమాజం కలకాలం గుర్తు పెట్టుకుంటుంది. రాళ్ళ గుట్టల నడుమ అయిదు వందల గదుల కాటేజీలు, యజ్ఞ యాగాదుల ప్రాంగణాలు, ప్రవచన శాలలు కాదు కావాల్సింది, చదువుకోడానికి కాస్త ప్రశాంతమైన స్థలం, పుస్తకాలు, కంప్యూటర్లు. పాలకుల విజ్ఞత, వివేచనల మీద ఆధారపడిన అంశమిది.

రాళ్ళగుట్టల చుట్టూ ప్రదక్షిణలు చేయడం వ్యక్తిగతం. ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి మొక్కులు వారు చెల్లించుకోవచ్చు. ఎన్నిసార్లు అయినా తిరగొచ్చు. అది ప్రజల సొమ్ముతో చేయకూడని పని. అధికార హోదాల్లో చేయదగని పని. వ్యక్తిగతాన్నీ, వ్యవస్థాగత విధానాన్నీ కలగాపులగం చేయకూడదన్న ఇంగితం అవసరం. ప్రజల సొమ్ముతో ప్రజలకు ఉపయోగపడే పనులు మాత్రమే చేయాలి. ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే ప్రశ్నించడం అనివార్యం. తెలంగాణ సమాజాన్ని అజ్ఞాన తిమిరాల్లోకి తీసుకెళతారా? విజ్ఞాన వెలుగుల్లోకి నడిపిస్తారా? అని తప్పక అడగాలి.

వెంటాడే వాక్యం

కొత్త భాషను ఎవరో ఎక్కడో చోట సృష్టిస్తారనుకుంటాం. ఎవరూ అలా చెయ్యరు. కొన్ని తరాలు తమ జీవిత క్రమంలో భాషల్ని సృష్టిస్తాయి. **- రాహుల్ సాంకృత్యాయన్**

ప్రజాశక్తి

సోపతి

మార్చి 1, 2015

లేఖలు 4

సంగీతం హుషారు పాటల పిఠాపురం 5

కవర్‌స్టోరీ

ఆహారమే ఉద్దీపన 6

అనువాద కథ

చిట్టిలుక - సున్నపు గొయ్యి 10

సృజన

పెళ్లి - కులం - మహిళ 12

నెమలీక 14

సీరియల్ ప్రేమ - విప్లవం 16

పురస్కారం

ఆమె ఆ సినిమాకి ప్రాణం 18

అలనాటి సంచిక స్రవంతి 20

సందర్భం హోళి రంగుల కేళి 21

మన మాణిక్యాలు 22

సోర్స్‌కోడ్

గైడ్ చేయాల్సిన బాధ్యత పెద్దలదే! 23

సమీక్షలు

విత్తనంలోకి చూసే పెద్ద చెట్టు 24

నాకు నచ్చిన పుస్తకం వెలుగు దివ్వెలు 25

ఈ వారం కవిత్వం

అడవి బిడ్డను మాట్లాడుతున్నా... 26

మనుషుల ప్రవర్తన వారు తీసుకునే ఆహారాన్ని బట్టి మారుతుంది. అలాగే మూడ్‌ను బట్టి ఏ ఆహారం తినాలనేది ఒక్కోసారి నిర్ణయమవుతుంది. మూడ్‌ని బట్టి ఆహారాన్ని, ఆహారాన్ని బట్టి మూడ్‌ని ఎలా మార్చుకోవచ్చో వివరించేదే ఈ వారం ముఖచిత్ర కథనం

లేఖలు

మార్పు దిశగా ఆలోచింపజేసింది

ఆదివారం సోపతిలో అంతరంగం శీర్షికన వచ్చిన సంపాదకీయం, అదే పేజీలో వచ్చే వెంటాడే వాక్యం ప్రతివారమూ బాగుంటున్నాయి. ఫిబ్రవరి పదిహేనో తేదీన వచ్చిన 'మార్పు దిశగా' శీర్షిక మమ్మల్ని ఆలోచింపజేసింది. 'యథాతథం వల్ల ఒరిగేదేమీ లేదు మార్పును అవగాహన చేసుకోవాలి' అన్న విషయాలు ఎంతగానో నచ్చాయి. ప్రతితరం మార్పును ఆశించడమేగాక ఒక దశ నుంచి మరో దశకు పురోగమిస్తుందనేది అక్షరాలా నిజం. 'ధిక్కారంలోనే ఒక రచన పరిమళిస్తుంది తలవంచడం నేర్చిన వాక్యానికి భవిష్యత్తులేదు' అనే వాక్యాలు బాగా ఆకట్టుకున్నాయి.

- వెన్నెల, హైదరాబాద్

అది లీడ్ అయితే బాగుండేది

గత ఆదివారం ప్రచురించిన సంచికలో 'పోచంపల్లి చేనేత' అనే స్టోరీ అద్భుతంగా ఉంది. ప్రస్తుత కార్పొరేట్ సమాజంలో నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూలంకషంగా ఇచ్చారు. అయితే ఆ కార్మికుల గోడు నుండి లీడ్ ప్రారంభిస్తే ఇంకా అద్భుతంగా ఉండేదన్నది నా అభిప్రాయం. ఇంకా స్వరాల రా'రాజు' అనే కథనం కూడా చాలా బాగుంది. అందులో ఆయన సినీ ప్రపంచానికి చేసిన సేవలు వర్ణించిన తీరు అద్భుతంగా ఉంది. ఇంకా ఇలాంటివి సీరీస్ బేస్‌డ్‌తో పాటు, సీజన్ బేస్‌డ్ స్టోరీస్ ఇస్తే బాగుంటుంది.

- సాగర్ వనపర్తి, కరీంనగర్

పోచంపల్లి ఘనత

సోపతిలో వచ్చిన పోచంపల్లి చేనేత' కథనం బాగుంది. నేత కార్మికుల జీవన దృశ్యాన్నేగాక, నేతలోని పనితనాన్ని, పనిలోని గొప్పదనాన్ని అర్థం చేసుకోవడంలో ఈ కథనం ఉపయోగపడింది. పోచంపల్లి చీరలంటే ఇప్పుడొక బ్రాండ్‌గా మారిపోయాయి. చేనేతల్లో ప్రఖ్యాతిగాంచడమేగాక, రైతాంగ సాయుధ పోరాటంలోనూ కీలకంగా మారిన పోచంపల్లి నేడు ప్రపంచవ్యాప్తమై వర్ధిల్లుతున్నది. నేత కార్మికుల బతుకు చిత్రాన్ని ప్రతిబింబింప చేసిన రచయితకు కృతజ్ఞతలు.

- కె. రామస్వామి, కరీంనగర్

పల్లె సంస్కృతిని ప్రతిబింబించే కథలు కావాలి

సోపతిలో వస్తున్న కథలు, కథనాలు, కవితలు బాగుంటున్నాయి. అయితే పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో అన్ని పత్రికల ప్రత్యేక అనుబంధాలు ఎక్కువగా పట్టణ వాతావరణం, లగ్జరీ జీవితాలతో ముడివడిన అంశాలను, ప్రముఖ రచయితల కథలను, రచనలను మాత్రమే ఎక్కువగా ఇస్తున్నాయి. పల్లె సంస్కృతినీ, జీవన విధానాన్నీ, పల్లెల్లోని వివిధ వృత్తులను, మానవ సంబంధాలను అవి విస్మరిస్తున్నాయి. అలాంటి వాటిని సోపతి ప్రోత్సహించాలని, అందించాలని కొత్త కొత్త ఇతివృత్తాలతో, సందర్భోచిత కథనాలతో అందించాలని కోరుతున్నాం.

- సావన్, పాలమూరు

మేనత్త పాత్ర అమోఘం

ఆదివారం సోపతిలో వచ్చిన అనుబంధాల్లో మేనత్త కథనం అమోఘం. అది చదువుతుంటే మా అత్తమ్మ మా ఇంటికి వచ్చినప్పుడు, మేము వాళ్లింటికి వెళ్లినప్పుడు కనబర్చిన ప్రేమానురాగాలు కళ్లముందు కదిలాయి. నిజంగా కుటుంబంలో మేనత్త ప్రేమలు, నానమ్మ అమ్మమ్మ తాతయ్యల ప్రేమలు లభించకుండా పోతున్న పరిస్థితి నెలకొన్న ఈరోజుల్లో ఇలాంటి కథనాలు ఎంతో హాయిగా ఉంటాయి.

- రఘునందన్‌రావు, పాలెం, మహబూబ్‌నగర్‌జిల్లా

మన జాతీయాలు

జెండేయుట

పూర్వం యుద్ధ సమయాల్లో రాజులు దండయాత్రకు బయలుదేరేవారు. మజిలీ చేసినచోట తమ జెండాను నిలిపి, శిబిరం ఏర్పాటు చేసుకొని తక్కువలెక్కువలు సర్దుబాటు చేసుకుని ఒకసారి సమీక్షించుకొని యుద్ధవ్యూహాన్ని నిర్ణయించుకొని తిరిగి బయలుదేరేవారు. గుర్తెరగటానికి జెండా వేయటం తప్పనిసరి. అదృష్టవశాత్తు యుద్ధంలో విజయం కలిగితే ఇరువైపుల శాశ్వతంగా ఒకే జెండా ఎగరవేయబడేది. జెండేయటమంటే తిష్టవేశానుడుట. "పెళ్ళాన్ని తీసుకొని వస్తానని పోయినవాడు పదిహేను దినాలాయె. మంచిగ అత్తారింట్ల జెండేసిండు. ఇంత మానం దక్క పుట్టుబడి పుట్టి మా మనం తీయపట్టె" అనటంలో ఈ జాతీయం ప్రయోగం వుంది.

పోచమ్మలోని తీరు

పోచమ్మల వాళ్ళని ఒక జాతి బిచ్చగాళ్ళు ఉంటారు. ఒక జట్టులో భార్యాభర్తలు ఇద్దరు వుంటారు. భార్య చంకన డోలు వేసుకుంటుంది. డోలు ఇరుపక్కల రెండు చేతుల్లో రెండు పుల్లలు పట్టుకొని పుల్లలతో గీరుతూ, కొడుతూ చప్పుడు చేస్తుంది. ఎదుటివారు చప్పుడును ఎంతోసేపు భరించలేరు. ఈ బిచ్చగత్తె మెడలో పోచమ్మ (గ్రామదేవత) విగ్రహం గుడిలో కూర్చున్నట్టుగా వేలాడుతుంటుంది. పొత్తిళ్ళలో పాపను ఉంచి చంక జోలెగా కలిగి వుండటం కూడా కద్దు. జాతరల్లో, సంతల్లో దారిన పోయేవారిని అడ్డగిస్తూ, వ్యాపారస్తుల కొట్టు ముందు 'ఇచ్చేవరకు చచ్చినా పోమనే' ధోరణిలో ఆడది ప్రదర్శన చేస్తుంటే, ఎదుటివారిని భయ కంపితులుగా చేసే విధంగా పోచమ్మల వాడు కత్తితో ఎడమ చెయ్యిపైన అరచేయి నుండి మోచేయి వరకు గల భాగంలో గాట్లు పెట్టుకొని పిడికిలి బిగించి నరాలపై ఒత్తిడి చేయటం ద్వారా, పలపల రక్తం కార్చుకుంటూ చేతిలో ఉన్న కొరడాతో తన శరీరంపై దద్దులు వచ్చేటట్లుగా కొట్టుకుంటూ, గంతులు వేస్తూ, హాహాకారాలు చేస్తూ ప్రదర్శన ఇస్తుంటాడు. ఈ పరిస్థితులను చూసి ఎంతటి కఠినాత్ముడైనా దానం ఇచ్చుకుంటాడు. ఇదే పోచమ్మలోని తీరు అంటే. "గణపతి పండక్కి వినాయకున్ని నిలబెడతామని నలుగురు వచ్చి పోచమ్మలోని తీరు ఇన్నూరు రూపాయలు చందా వసూలు చేసిండ్రు, ఇవ్వక తప్పలేదు" లాంటి సందర్భాల్లో ఈ జాతీయం ప్రస్తావన కనిపిస్తుంది.

- వేముల పెరుమాళ్ళు

■ సంగీతం

ఊరిపేరునే ఇంటిపేరుగా మార్చుకున్న అతి కొద్దిమంది ప్రముఖులలో గాయకుడు పిఠాపురం నాగేశ్వరరావు ఒకరు. ఆయన ఇంటిపేరు పాతర్లగడ్డ. అయినా గానీ ఆయన పుట్టిన ఊరిపేరునే ఇంటిపేరుగా మార్చుకున్నారు. చివరికి అదే ఆయన ఇంటిపేరుగా మారిపోయింది.

హుషారు పాటల పిఠాపురం

కొన్ని పాటలని ఎక్కువసార్లు వింటే మొదట కలిగిన ఇష్టం కొద్దికొద్దిగా పోతుంది. కానీ పిఠాపురం పాడిన హుషారైన పాటలను వింటుంటే మాత్రం ఇప్పటికీ అదే ఊపు, హుషారు కలుగుతాయి.

పిఠాపురం నాగేశ్వరరావుగారికి చిన్నప్పటి నుండే నాటకాలంటే ఉన్న అభిరుచితో అనేక వైవిధ్యభరితమైన పాత్రలు పోషించారు. అందరూ నటించడం కోసం మద్రాసు వెళ్ళే రోజుల్లో ఈయన గాయకుడు కావడం కోసం మద్రాసు రైలెక్కారు. 16 సంవత్సరాలకే గాయకుడిగా మారారు. 1946లో 'మంగళసూత్రం' చిత్రంతో సినీరంగంలో ప్రవేశించిన ఆయన 'బొమ్మరిల్లు (1978)' చిత్రంలో చివరి సారి పాడారు. తెలుగు, తమిళం, హిందీ, సింహళ, కన్నడ భాషల్లో మొత్తం కలిపి సుమారు ఏడు వేల పాటలు పాడారు. ఘంటసాల ప్రోత్సాహంతోనే ఎక్కువగా పాటలు పాడానని పిఠాపురం చెప్పుకునేవారు. నటులలో మంచి గొంతు లేనివారికి గాత్రదానం చేసే ఆనవాయితీని ప్రారంభించింది కూడా ఈయనే. చివరికి దానినే వృత్తిగా చేసుకున్నారు. సినీ హాస్య గాయకునిగా శ్రోతల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు.

ఎన్టీఆర్, అంజలీదేవి, వైజయంతిమాల నటించిన 'సంఘం' చిత్రంలో "పెళ్ళీ... పెళ్ళీ పెళ్ళీ పెళ్ళీ.... ఈడైనా దానితో జోడీగా హాయిగా ఈడైనా, ఈలోకమందు సౌఖ్యాల పొంది ఆనందమొందగా, పందిళ్ళ కింద విందులు చేసే అత్తిల్లే స్వర్గం ఆనందమార్గం" ఈ పాటకు తోలేటి సాహిత్యం అందించారు. సంగీతం సుదర్శనం. పిఠాపురం నాగేశ్వరరావుకి లైఫ్‌టైమ్ సాంగ్ ఇది. ఒక రకంగా ఈ పాటతోనే ఆయన బాగా ప్రాచుర్యం పొందారు. ఆ రోజుల్లో ఆ పాటను వెయ్యని పెళ్ళి పందిరి తెలుగు రాష్ట్రంలో లేదంటే అతిశయోక్తి కాదు.

"డివ్వి డివ్వి డివ్విట్టం నువ్వంటే నాకిట్టం, డీడిక్కంది అదృష్టం గట్టెక్కింది మన కట్టం... బాజాలతో... బాకాలతో... పందిట్లో ఇద్దరం ఒకటౌదాం" ఎప్పుడెప్పుడు పెళ్ళవుతుందా, ఆ పెళ్ళితో తన కష్టాలన్నీ తీరిపోతాయి, కాలం కలిసొస్తుందనుకునే పెళ్ళి కొడుకు ఆనందం... ఆ పెళ్ళికొడుకు ఆరాటం చూసి చుట్టూ ఉన్న వాళ్ళ పరిహాసం... ఇవన్నీ పట్టించుకోని అతని సంబరం... ఇదంతా ఊహించుకునే పెళ్ళికొడుకు పాడే పాట ఎన్టీఆర్, బి.సరోజాదేవి నటించిన 'దాగుడు మూతలు' చిత్రంలో రేలంగి, శారదలమీద చిత్రీకరించారు. కె.వి.మహదేవన్ సంగీత సారథ్యం వహించిన ఈ పాటకు ఆరుద్ర సాహిత్యం అందించారు.

ఒక్కోసారి చీకట్లో దేన్నయినా ఆకస్మికంగా చూసినప్పుడు భయపడడం సహజం. ఒంటరిగా ఉన్నప్పుడు ఆ భయం మరింత పెరుగుతుంది. చీకట్లో నీడని చూసి భయపడిన అమ్మాయిని ఓ కొంటె కుర్రాడు ఆమె భయాన్ని అలుసుగా తీసుకుని ఆటపట్టిస్తే ఆ పాట కృష్ణ, కాంచన నటించిన 'అవే కళ్ళు' చిత్రంలోని "మా ఊళ్ళో ఒక పడుచుంది దయ్యమంటే భయమన్నది... ఆ ఊళ్ళో ఒక చిన్నోడు నేనున్నాలే పదమన్నాడూ...చెమ్మచెక్క చెమ్మచెక్క చెమ్మచెక్క..." పాటలా వుంటుంది.

అష్టమ వ్యసనాల్లో పేకాట ఒకటి. లాటరీ లాంటి ఈ ఆటలో ఎప్పుడు లాభం వస్తుందో, ఎప్పుడు నష్టం వస్తుందో చెప్పడం కష్టం. ఎప్పుడూ నష్టపోని ఎంత చేయితిరిగిన ఆటగాడైనా ఒక్కోసారి ఈ ఆటవల్లే బికారిగా మారిన సందర్భాలూ ఉంటాయి. రోజూ ఆడుతుంటే ఎప్పుడో ఒకప్పుడు కలిసిరాకపోతుందా అనే ఆశతో భార్యమెడలో పుస్తెలతో సహా అమ్మి ఆడిన వ్యక్తి, అప్పుడు కూడా ఓడిపోతే అతని బాధ 'కులగోత్రాలు' చిత్రంలో మాధవపెద్ది సత్యంతో కలిసి పిఠాపురం పాడిన "అయ్యయ్యో జేబులో డబ్బులు పోయెనే, అయ్యయ్యో జేబులు ఖాళీ ఆయెనే, ఉన్నది కాస్తా ఊడింది.. సర్వ మంగళం పాడింది, పెళ్ళాం మెడలో నగలతో సహా తిరుక్షవరమైపోయింది" పాటలా వుంటుంది. ఇదే ట్యూన్‌ని నానీ నటించిన 'పిల్ల జమిందార్' చిత్రంలో రీ మిక్స్ పాటగా వాడారు.

ఇప్పుడు దొరకడంలేదు కానీ ఒకప్పుడు గోలీసోడాకి ఉన్న ఆదరణ అంతా ఇంతా కాదు. రకరకాల శీతల పానీయాలు వచ్చాక గోలీసోడాకి ఆదరణ తగ్గింది. ఈ సోడానుండి వచ్చే గ్యాస్‌ని బాగా ఇష్టపడతారు. గ్యాస్ అంటే మరో అర్థంలో ఉత్తుత్తి మాటలు అని కూడా అర్థం వుంది. రాజకీయ నాయకుల ఉత్తిత్తు మాటల వంటిది కాదు గోలీ సోడా అనే అర్థంతో 'లక్ష్మీ నివాసం' చిత్రంలో ఆరుద్ర రాసిన 'సోడా సోడా... ఆంధ్రా సోడా.. గోలీ సోడా ఢిల్లీ సోడా" పాటకు కె.వి.మహదేవన్ సంగీతం అందించారు.

కొన్ని పాటలని ఎక్కువసార్లు వింటే మొదట కలిగిన ఇష్టం కొద్దికొద్దిగా పోతుంది. కానీ పిఠాపురం పాడిన హుషారైన పాటలను వింటుంటే మాత్రం ఇప్పటికీ అదే ఊపు, హుషారు కలుగుతాయి.

- బి.మల్లేశ్వరి

రైలు బోగీ బ్రిడ్జి

జార్జియా దేశంలో అఖాల్కాలకి సమీపంలో దిలిస్కా నది మీద ఓ రైలు బోగీని వంతెనగా ఉపయోగిస్తున్నారు. రైల్వే వాళ్ళు పనికి రాదని వదిలేసిన ఈ బోగీని నదిని దాటడానికి ఉపయోగిస్తున్న ఆ ప్రాంత వాసుల ఉపాయాన్ని అభినందించాల్సిందే.

ఆహారమే ఉద్దీపన

మనుషుల ప్రవర్తనను ప్రభావితం చేసే అంశాలు చాలా ఉంటాయి. వాటిలో దేని ప్రత్యేకత దానిదే. కొన్ని మన చేతుల్లో లేని అంశాలూ మన ప్రవర్తనను నియంత్రిస్తాయి. కొన్ని మన పరిధిలోనే ఉంటాయి. అటువంటి అంశాల్లో ఆహారం ఒకటి.

కాలం గడిచేకొద్దీ జీవితం యాంత్రికమయమైపోతోంది. మనుషుల అనుభూతులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇంట్లోను, పనిప్రదేశాల్లోనూ ప్రశాంతతే లేకుండా పోయింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా షిఫ్టుల్లో పనిచెయ్యవలసిన అనివార్యపరిస్థితుల్లో కోట్లాదిమంది జీవిస్తున్నారు. దీంతో మానవ శరీర గడియారం ఒడిదుడుకులకు లోనవుతోంది. శరీర ధర్మాల్లో ఎన్నో మార్పులు కలుగుతున్నాయి. ఈ మార్పులు మేలు చేసేవయితే ఫరవాలేదు. కానీ ఇవి మనిషిని మానసికంగానూ, శారీరకంగానూ కుంగదీసేవి కావడమే శోచనీయం. తరచుగా నిద్రపోయే సమయాలు మారిపోవటంవల్ల మనిషికి నిస్పృహ(డిప్రెషన్) కలుగుతుంది. ఆహారం తినే సమయాల్లో మార్పుల వల్ల ఎసిడిటీ, ఊబకాయం వస్తాయి. మొత్తంమీద ఈ పరిస్థితులన్నీ రక్తపోటు, మధుమేహం రావటానికి సోపానాలవుతున్నాయి. నైట్ షిఫ్టులతో సంబంధం లేనివారు సైతం ఇటువంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు. చాలామంది ఊరకూరకే ఆందోళనకు గురవుతూ ఉంటారు. ఇటువంటివారందరూ డాక్టర్ల చుట్టూ తిరిగి కాలం, డబ్బు ఖర్చు చేయడం సాధారణ దృశ్యమయింది. ఒక్కో సారి ఒక్కో విధంగా మన మనసు ప్రకోపిస్తూ ఉంటుంది. ఫలితంగా మన ప్రవర్తన ఇబ్బంది కరంగా తయారవుతుంది. కొన్నిసార్లు ఉత్సాహపూరితంగానూ ఉంటుంది. ఇలా మనలో కలిగే ఉత్సాహ, నిరుత్సాహాలకు, ఆందోళన, నిస్పృహలకు మనం తినే ఆహారమే ప్రధాన కారణమంటే మీరు నమ్ముతారా? కానీ ఇది నిజమంటున్నారు శాస్త్రవేత్తలు. ఇదే నిజమయితే మూడ్‌ని బట్టి ఆహారాన్ని, ఆహారాన్ని బట్టి మూడ్‌ని మార్చుకునే అవకాశం మనకుంటుంది. ఇదెలా సాధ్యమో చూద్దాం

ఆహారం–మనిషి ప్రవర్తనకు ఉన్న సంబంధాన్ని గురించి తెలుసుకోవాలంటే ముందు వివిధ ఆహార పదార్థాలు మనిషి మెదడును ఎలా ప్రభావితం చేస్తాయో గమనించాలి. మనం తీసుకునే ఆహార పదార్థాలను బట్టి మెదడులో కొన్ని రసాయనాలు ఊరుతాయి. ఈ రసాయనాలే మన మూడ్‌ని నిర్ణయిస్తాయి. ముఖ్యంగా డొపమైన్, నోర్‌పైన్‌ఫ్రిన్, సెరొటోనిన్ అనే రసాయనాలు మన మూడ్‌ని ప్రభావితం చేస్తాయి. ఈ రసాయనాలనే న్యూరో ట్రాన్స్‌మిటర్స్ అని పిలుస్తున్నారు. డోపమైన్, నోర్‌పైన్‌ఫ్రిన్ మెదడులో ఉత్పత్తి అయితే మనిషి సాధారణంగా ఉండేదానికన్నా ఎక్కువ అప్రమత్తంగా ఉంటాడు. మనసు ఏకాగ్రత పెరుగుతుంది. సెరొటోనిన్ ఉత్పత్తి అయితే మనిషిలోని ఉద్రిక్తతలు తగ్గి ప్రశాంతత పెరుగుతుంది. ఏదో మత్తు ఆవరించినట్లు అయిపోతుంది. స్థిరంగా ఉండే సెరొటోనిన్ వల్ల పాజిటివ్ (మేలుచేసే) మూడ్ వస్తుంది. బహిష్టు సమమయంలోనూ... మోనోపాజ్ దశలోనూ స్త్రీలు కొంత అసహజంగా, అసహనంగానూ ప్రవర్తిస్తారు. ఇలా ప్రవర్తించటానికి కారణం ఆ సమయంలో వారిలో కొన్ని హార్మోన్‌లు తక్కువ సెరొటోనిన్ ఉత్పత్తి అయ్యేలా ప్రభావితం చెయ్యటమే. ఇటువంటి సందర్భాల్లో స్త్రీలు కార్బొహైడ్రేట్స్ ఉన్న పదార్థాలు... అంటే అన్నం, పాస్తా, తీపి పదార్థాలు, పండ్లు తీసుకుంటే ఉద్రిక్తత తగ్గి రిలాక్స్ అవుతారు. ఇందుకు కారణం ట్రిప్టోఫాన్ అనే అమినో ఏసిడ్ మెదడులో ప్రవేశించి సెరొటోనిన్ ని ఎక్కువగా ఉత్పత్తి చెయ్యటమే. కడుపు నిండా కార్బొహైడ్రేట్స్ అధికమొత్తంలో ఉండే అన్నం, గోధుమ రొట్టెలు, స్వీట్స్ వంటివి ఎక్కువగా తింటే నిద్రమత్తు ఆవహించటం అందరూ గమనించే ఉంటారు. అందుకు కారణం మెదడులో ఉత్పత్తి అయ్యే సెరొటోనిన్ అనేది గుర్తుంచుకోవాలి.

మిగిలిన న్యూరో ట్రాన్స్‌మిటర్స్ అయిన డోపమైన్, నోర్‌పైన్‌ఫిన్లు.. ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకున్నప్పుడు ఉత్పత్తి అవుతాయి. ప్రొటీన్లు అధికంగా ఉండే మాంసం, పాలు, గుడ్లు, చీజ్, చేపలు, బీన్స్ తిన్నప్పుడు మనలో చురుకుదనం, ఏకాగ్రత పెరుగుతాయి. అయితే కేలరీలు ఎక్కువగా ఉండే బర్గర్స్, వేపుళ్ళు, షేక్స్, ఇతర కొవ్వు పదార్థాలు తీసుకుంటే మాత్రం ఇబ్బందే. కొవ్వులు త్వరగా అరగవు. కొవ్వులను తిన్నప్పుడు వాటిని అరిగించటానికి శరీరంలోని రక్తంలో అధికభాగం పొట్టవైపే ప్రవహిస్తుంది. ఫలితంగా మెదడుకు సరఫరా అవ్వాల్సినంత పరిమాణంలో రక్తం సరఫరా కాదు. దీంతో మెదడు చురుకుదనం కోల్పోతుంది. నిద్రమత్తు ఆవహించిన ట్లు అవుతుంది.



చాకొలెట్లతో తాగుబోతుల కట్టడి

నిత్య జీవితంలో అనేక మంది మూడ్‌ని వారు తినే ఆహార పదార్థాలు మార్చివేస్తున్నాయి. ఈ విషయాన్ని గమనించారు గనుకే బ్రిటీష్ పోలీసులు తాగుబోతుల అల్లరిని అరికట్టడానికి కొత్త మార్గాన్ని అనుసరిస్తున్నారు. బ్రిటన్‌లో ఆల్కహాల్ డ్రింక్స్ సేవనం సాధారణమైన విషయం. అలాగే తాగిన మత్తులో నేరాలు చేసేవారి సంఖ్యా అధికమే. అందుకే బారుల్లో తాగి బయటకొచ్చి అల్లరి చేసే మందుబాబులను మాటలతో బుజ్జగించటం కష్టమైన వ్యవహారం. అలాగని శిక్షలు వేస్తే తరువాత మరింత రెచ్చిపోయే అవకాశమూ ఉంది. అందుకే పోలీసులు హానికరం కాని ఓ వజ్రాయుధాన్ని కనిపెట్టారు.

మొదటగా బోర్నా అనే పట్టణంలో బార్‌లు, పబ్బుల దగ్గర పోలీసులు కాపుకాశారు. తిని, తాగి బయటకు వచ్చేవారిని నవ్వుతూ పలకరించి వారికి చాకొలెట్లు ఇచ్చారు. చాకొలెట్లను చూసిన మందుబాబులు ఆనందంతో వాటిని తినేసి ప్రశాంతంగా ఇంటికి చేరారు. ఇలా రెండు సార్లు బార్‌లు పబ్‌ల దగ్గర చాకొలెట్లను పంచారు పోలీసులు. ఆ తరువాత చాకొలెట్లను పంచిన రెండు రోజుల్లో నమోదయిన క్రైమ్ కేసుల రేటును పరిశీలించారు. మిగతా రోజుల కంటే పట్టణంలో తాగుబోతులకు చాకొలెట్లు పంచిన రెండురోజుల్లో తక్కువ నేరాలు జరిగినట్లు ఆ పరిశీలనలో బయటపడింది. దీని వెనుక ఉన్న రహస్యం ఒక్కటే. ఆల్కహాల్ తీసుకున్న వారు చాకొలెట్లు తిన్నప్పుడు సెరొటోనిన్, ఎండార్ఫిన్లు ఎక్కువ మొత్తంలో విడుదలై మనసులో ఉన్న అసహనాన్ని తగ్గించి ప్రశాంతతను ప్రోదిచేశాయి. అందుకే ఎటువంటి నేరాలకూ పాల్పడకుండా తాగిన వాళ్ళు ఇంటికి చేరారని పోలీసులు విశ్లేషించారు. ఇలా లాఠీలు, గన్స్ వంటి వాటిని ఉపయోగించకుండా కేవలం చాకొలెట్లతోనే క్రైం రేటును తగ్గించిన పోలీసులకు ప్రశంసలు అందాయి.

తారుమారైన చెస్ ఛాంపియన్ల మూడ్స్

మనుషుల మూడ్‌ను తినే ఆహారం ప్రభావితం చేస్తుందని బ్రిటన్‌లోనే జరిపిన మరో ప్రయోగ ఫలితాలూ నిరూపిస్తున్నాయి. టెర్రీ, పాల్ ఇద్దరూ మాజీ బ్రిటీష్ చెస్ ఛాంపియన్లు. వీళ్ళు తిన్న ఆహారం వాళ్ళ ఆట తీరును ఎలా ప్రభావితం చేస్తుందో గమనించటానికి శాస్త్రవేత్తలు ఓ ఫైవ్ స్టార్ హోటల్లో చెస్ పోటీ నిర్వహించారు. పోటీ ప్రారంభానికి ముందు టెర్రీకి కార్బొహైడ్రేట్స్ అధికంగా ఉన్న ఆహారాన్ని ఇచ్చారు. పాల్‌కేమో ప్రొటీన్లు అధికంగా ఉండే మాంసాహారాన్ని వడ్డించారు. ఇద్దరూ తృప్తిగా భోంచేసి చెస్ ఆడటానికి కూర్చున్నారు. టెర్రీ చురుకుగా ఎత్తులు వెయ్యలేకపోతున్నాడు. మైండ్ రిలాక్స్‌డ్‌గా అనుభూతి చెందుతుండటంతో ఏకాగ్రతతో ఎత్తులు వెయ్యలేకపోతున్నాడు. ఇదే

సమయంలో ప్రొటీన్లు ఉన్న ఆహారాన్ని తీసుకున్న పాల్ చురుకుగా ఎత్తులు వేస్తున్నాడు. దీంతో అతి కష్టం మీద పాల్‌తో టెర్రీ ఆటను డ్రా చేసుకున్నాడు. మరుసటి రోజు టెర్రీ కి ఇచ్చిన ఆహారాన్ని పాల్‌కి, పాల్‌కిచ్చినదాన్ని టెర్రీకి వడ్డించారు. ఇప్పుడు టెర్రీ స్పీడుగా ఎత్తులు వేస్తున్నాడు. పాల్ మత్తు ఆవహించినట్లు నిదానంగా ఆడాడు. ఆట ముగిసిన తరువాత వాళ్ళిద్దరూ తాము తిన్న ఆహారం తమ ఆటపై ఎలాంటి ప్రభావాన్ని చూపిందో శాస్త్రవేత్తలకు వివరించారు. దీంతో మూడ్‌ని తినే ఆహారం ప్రభావితం చేస్తుందని ధ్రువీకరించుకున్నారు.

ఆహారంతోనే చికిత్స

డయానా ఓ మధ్యతరగతి అమ్మాయి. ప్రసవం తరువాత విపరీతమైన నిస్పృహకు (డిప్రెషన్)కి గురయింది. ఎప్పుడూ ఏదో కోల్పోయినట్లు ఉండేది. ఎవరితో కలవకుండా ఒంటరిగా కుమిలిపోయేది. దీంతో తొమ్మిది నెలల పాటు పుట్టిన బిడ్డను కూడా ఆమెకు దూరంగా పెంచవలసివచ్చింది. ఈమె లాగే కొంతమంది స్త్రీలకు ప్రసవానంతరం ఇలాంటి సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. ఇలాంటి వారందరూ డాక్టర్ల దగ్గరకు వెళ్ళి మందులు వాడటం మామూలు విషయమే. డయానాను కూడా ఇంట్లోవాళ్లు డాక్టర్ల చుట్టూ తిప్పారు. కానీ ఫలితం మాత్రం కనిపించలేదు. ఈ పరిస్థితుల్లో డయానా ఒక ఫ్రెండ్ సలహామేర మంచి ఆహార సలహా నిపుణుణ్ణి (డయటీషియన్)కలిసింది. రక్తం, మూత్ర పరీక్షల ను జరిపించి ఆ రిపోర్టులనూ పరిగణలోనికి తీసుకున్న డయటీషియన్ డయానా తీసుకోవలసిన ఆహార పదార్థాల జాబితా రూపొందించారు. ఫలితంగా అప్పటివరకు డయానా తీసుకుంటూ వచ్చిన ఆహారంలో పూర్తి మార్పులు చోటు చేసుకున్నాయి. చేపలు, ఆకుకూరలు వంటి ఆర్గానిక్ ఫుడ్స్, తాజా కూరగాయలు, పండ్లు అధికంగా తినటం ప్రారంభించింది డయానా. బ్రేక్‌ఫాస్ట్‌లో కూడా గ్రిల్డ్ ఫిష్ వంటి ప్రొటీన్డ్‌ఫుడ్ తీసుకోవటం ఆమె ఆరోగ్యాన్ని పూర్తిగా మార్చివేసింది. రెండు వారాల్లో ఆమెలో ఉన్న నిస్పృహ తొలగిపోయి సాధారణ స్థాయికి చేరుకుంది. ఆహారం చేసే అద్భుతాలకు డయానా ఉదంతం ఒక ఉదాహరణ మాత్రమే.

లైంగిక జీవితానికి ప్రేరకం

చురుకుగా దాంపత్య జీవితంలో పాల్గొనటం వారు తీసుకునే ఆహారం పైనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా రాత్రి పూట తీసుకునే ఆహారం దాంపత్య జీవితాన్ని ఆనందంగా గడపటాన్ని నిర్దేశిస్తుందని శాస్త్రవేత్తలంటున్నారు.

అనాదిగా ఏం తింటే లైంగిక సామర్థ్యం పెంపొందుతుందనేది ఓ ఆసక్తికరమైన టాపిక్‌గా ఉంది. దీనికి సంబంధించి అనేక కథలూ ప్రచారంలో ఉన్నాయి. ఆ కథలను అలా ఉంచి సైంటిఫిక్‌గా ఆలోచిస్తే... మనం నిత్యం చూసే అనేక ఆహార పదార్థాల్లో మన సామర్థ్యాలను ప్రభావితం చేసేవి చాలా ఉన్నాయి. చేపల కూర ను రాత్రి ఆహారంలో తీసుకోవటం ఎంతో మేలని డాక్టర్లు చెబుతున్నారు. అలాగే కాల్షియం, మెగ్నీషియం ఎక్కువగా ఉన్న కూరగాయలు, ఆకుకూరలు ఎంతో మేలు చేస్తాయి. స్ట్రాబెర్రీస్, గ్రిల్డ్ ఫిగ్స్‌పై తేనె పూసి తింటే ఆ మజానే వేరు. ఆ తరువాత మంచి ముదురు రంగు చాకొలెట్ తినాలి. ఫలితంగా మనసు పారవశ్యంతో తేలియాడుతుంది. ఈ స్థితిలో బెడ్‌రూం ఒక స్వర్గసీమ అవుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

మనసు-ఆహారం

మనం తీసుకునే ఆహారమే మన మనసును ఉద్దీపింప చేసి సరికొత్త మూడ్‌లోకి తీసుకువెళుతుంది. తీగబచ్చలి వంటి ముదురు ఆకుపచ్చ ఆకుకూరల్లో 'బి' విటమిన్ ఫోలేట్ అనే ద్రవరూపంలో ఉంటుంది.

విద్యార్థులు ఏం తినాలి?

ఇది పిల్లలు పరీక్షలకు సిద్ధపడుతున్న తరుణం. వాళ్లకు పెట్టే ఆహారం వారి సామర్థ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉండే ఎక్కువగా అన్నం, గోధుమరొట్టెలు, స్వీట్స్‌ను పరీక్షలకు వెళుతున్న పిల్లలకు పెట్టకూడదు. అలా చేస్తే వారి మెదడు చురుకుగా పనిచెయ్యదు. నిద్రమత్తు వచ్చినట్లు ఉంటుంది. చదివిన విషయాలు సరిగా గుర్తుకురావు. మంచి ప్రొటీన్స్ ఉన్న పాలు, పండ్లు, గుడ్లు, చేపలు, చికెన్, ఆకు కూరలు వారి ఆహారంలో ఎక్కువగా ఉండేలా చూడాలి. అప్పుడే వారు చురుకుగా చదవటం కాని, చదివిందాన్ని పరీక్ష పేపర్లపై సమర్థవంతంగా పెట్టడానికికానీ వీలవుతుంది.

డిప్రెషన్‌లో ఉన్న వారు ఇటువంటి ఆకుకూరలు తింటే మంచిఫలితం ఉంటుంది. అలాగే మూడ్‌ను ప్రభావితం చేసే నోర్‌ప్రైన్‌ఫ్రిన్, సెరొటోనిన్, డోపమైన్ వంటి రసాయనాలు మెదడులో ఉత్పత్తి కావాలంటే ఫోలేట్ చాలా అవసరం. అందుకే డిప్రెషన్‌లో ఉన్న వారిని మామూలు మనుషులను చెయ్యాలంటే వారిలో ఫోలేట్ స్థాయిని పెంచాలని హార్వార్డ్ మెడికల్ స్కూల్ శాస్త్రవేత్తలు నిర్ధారించారు. న్యూజిలాండ్ పరిశోధకులు మరో కొత్త విషయాన్ని కనిపెట్టారు. ఎక్కువ కూరగాయలు, పండ్లు తినేవారు ప్రశాంతంగా, ఆనందంగా, ఎక్కువ శక్తివంతంగా ఉన్నట్లు వీరు గమనించారు.' బ్రిటీష్ జర్నల్ ఆఫ్ హెల్త్ సైకాలజీ'లో ఈ వివరాలు తెలియచేసిన పరిశోధకులు కొన్ని సూచనలు చేస్తున్నారు. రోజులో ఏడెనిమిది సార్లు పండ్లు, కూరగాయలను కలిపి ఆహారంగా తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని వారు సూచిస్తున్నారు.

మరీ తక్కువ కార్బో హైడ్రేట్స్ ఉన్న ఆహారాన్ని తీసుకుంటే ఏం జరుగుతుందో కూడా ఒకసారి తెలుసుకోవాలి. శరీరానికి కార్బోహైడ్రేట్స్ కూడా అవసరమే. బాగా లావుగా ఉన్న వారి బరువును తగ్గించడానికి తక్కువ కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారాన్ని ఇవ్వటం వల్ల రెండువారాల్లోనే వారికి వ్యాయామం చెయ్యాలనే కోరిక తగ్గినట్లు అరిజోనా స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. వ్యాయామం చెయ్యనివారిలో కొంత నిస్పృహ చోటుచేసుకునే అవకాశం ఉందనీ అంటున్నారు.

ఒమేగా-3 పాటీ ఏసిడ్స్ కలిగిన ఆహారాన్ని తీసుకుంటే మంచి మూడ్‌లో ఉండటానికి అవకాశం ఉంది. చేపలు, వాల్‌నట్స్‌లో ఈ ఏసిడ్స్ సమృద్ధిగా ఉంటాయి. నిరాశ, నిస్పృహలలో ఉన్నవారి మూడ్‌ని మార్చడంలో ఇవిప్రధాన పాత్ర పోషిస్తాయి.

ఇక చాలా మంది ఉదయం అల్పాహారం(బ్రేక్ ఫాస్ట్) తీసుకోరు. లేదా అప్పుడప్పుడు మాత్రమే తీసుకుంటారు. ఇది మంచిపద్ధతి కాదని పరిశోధకులు అంటున్నారు. క్రమం తప్పకుండా సమతుల్య అల్పాహారం తీసుకోవటం వల్ల రోజంతా మంచి జ్ఞాపకశక్తి, సత్తువ ఉంటాయని, ప్రశాంతమైన భావన కలుగుతుందని అంటున్నారు. అలాకాక అల్పాహారాన్ని అప్పుడప్పుడు మాత్రమే తీసుకుంటే ఇందుకు పూర్తిగా భిన్నమైన ఫలితాలు కలుగుతాయి. అంటే విపరీతమైన అలసట, ఆందోళన కలుగుతాయన్నమాట. అయితే బ్రేక్‌ఫాస్ట్‌లో ఏం తినాలి అనేదీ ముఖ్యమైన అంశమే. ప్రొటీన్లు, హోల్‌గ్రెయిన్ కార్బోహైడ్రేట్స్ ఉన్న అల్పాహారాన్ని టిఫిన్‌గా తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

ఆహారంలో పండ్లు, చేపలు, కూరగాయలతోపాటు తృణధాన్యాలు, నట్స్, అపరాలు తీసుకోవాలి. వీటన్నింటిలోనూ పోషకాలు చాలా ఉంటాయి. ఇటువంటి ఆహారం తీసుకుంటే నిరాశ, నిస్పృహలు దరిచేరవని స్పెయిన్ పరిశోధకులు అంటున్నారు. సముద్రపు ఉత్పత్తులు, గింజలు, బ్రౌన్ రైస్, చికెన్, ఓట్ మీల్, బీన్స్, తక్కువ కొవ్వు ఉన్న పాల ఉత్పత్తులు తీసుకుంటే ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని, మూడ్ కూడా బాగుంటుందని పరిశోధకులు చెబుతున్నారు.

అలాగే మన మూడ్‌ని బట్టీ మనం తీసుకునే ఆహారం ఉంటందనేది కాదనలేని సత్యం. మనకు బాగా అలసటగా ఉంటే వెంటనే ఒక కప్పు టీనో, కాఫీనో తాగుదామనిపిస్తుంది. టీ, కాఫీ, కోక్ వంటి పానీయాల్లోనూ, చాకొలేట్‌లోనూ కెఫీన్ అనే పదార్థం ఉంటుంది. ఈ పదార్థం శరీరానికి అందగానే ఏదో రిలాక్స్ అయిన అనుభూతి కలుగుతుంది. కెఫీన్ పానీయాలు అలవాటయినవారికి మనసు అలసటగా ఉన్నప్పుడు వాటిని తీసుకోవాలనిపిస్తుంది. అలా ఎక్కువ మొత్తంలో పదే పదే తీసుకుంటే మాత్రం మన మూడ్ తిరగబడుతుంది. ఎక్కువ టీ, కాఫీలు తాగే వారిలో ఆందోళన, నిస్పృహ లక్షణాలు తలెత్తుతాయని పరిశోధకులు అంటున్నారు.

- ఎస్సార్కె, 7702508259

■ అనువాద కథ

ఒకనాడు 'కాంట్చిల్' అనే అమెరికా దేశపు చిట్టెలుక ఒక కాపువాని యింటి పక్కగా నడచిపోతూంది. నడుస్తూ నడుస్తూ, మెల్లగా ఆ ఇంటి తలుపు సందులోంచి తొంగి చూసింది. అరటి ఆకు పొట్లంలో, అరటి పండ్లతో తయారు చేసిన తియ్యని అప్పచ్చి ఒకటి దాని కంట బడింది. కాపూ, కాపు భార్యా ఇంట్లో లేరని కనిపెట్టింది. వాళ్ళిద్దరూ వరిపొలాల్లో పనికి వెళ్ళారు. ఇదే సమయమని ఆ చిట్టెలుక ధైర్యంగా ఇంట్లో దూరింది. తియ్యని అప్పచ్చిని చూసేటప్పటికి ఆ చిట్టెలుక నోరూరింది. చటుక్కున అప్పచ్చిపొట్లం నోట కరచుకుని పెరటిలోకి పారిపోయింది. పోతూ పోతూ, అరటి ఆకు మెల్లగా విడదీసి అప్పచ్చి కొద్దికొద్దిగా, కొరుక్కుని తింటూ నడుస్తుంది. తిండి ధ్యాసలో అరటిఆకు అడ్డం వచ్చి కండ్లు కనిపించక పోవడం చేత, నడుస్తూ నడుస్తూ ఆ చిట్టెలుక కాపువాని పెరటిలో ఉన్న సున్నపు గోతిలో పడిపోయింది.

చిట్టెలుక - సున్నపు గొయ్యి

లోతుగా ఉన్న సున్నపుగొయ్యిలో తను పడ్డందుకు ఆ చిట్టెలుక్కి విచారంతో పాటు చాలా ఆశ్చర్యం కూడా కలిగింది. తను బాగా, చురుకుగా ఎగరగలదు. అయినా అంత లోతు గొయ్యిలోంచి పైకి ఎగరలేకపోయింది. ఎట్లాగా అని ఆలోచిస్తూంది. నోట్లో అరటి ఆకు మాత్రం అట్లాగే ఉంది.

ఏం చెయ్యడానికీ తోచక, చిట్టెలుక 'తూహాన్, తూహాన్' అని అరిచింది (ఇండోనేషియా భాషలో 'తూహాన్ అంటే దేవుడన్న మాట). ఇంతలోకే అక్కడికి 'బాబీ' అనే అడవిపంది వచ్చింది.

"ఎవరా గోతిలో దిగి దేవుని పేరు స్మరిస్తున్నారు?" అని గొయ్యి అంచున నిలబడి బాబీ అడిగింది.

చిట్టెలుక అరటి ఆకును పుస్తకంలాగ పట్టుకని అందులో చూసి చదివి పారేస్తూంది. "విను, బాగా విను. తూహాన్ దైవం ఏమంటున్నాడో! ఇవాళ ప్రళయ దినం. ప్రాణం కాపాడుకోవాలని కోరుకునే వాళ్ళు ఈ పవిత్ర గృహంలో ఆశ్రయం పొందవచ్చు" అని చిట్టెలుక చదివింది.

"నీకు ఎవరు చెప్పారే ఇవాళ ప్రళయ దినమని?" అని బాబీ అడిగింది.

"ఈ పవిత్ర గ్రంథంలో స్పష్టంగా రాసివున్న విషయం ఇంకా ఒకళ్ళు చెప్పేదేమిటి? ఫలానా రోజున, అంటే ఈ రోజునే ఈ ప్రపంచం ప్రళయంలో మునిగిపోతుంది. ఈ పవిత్రమైన సున్నపు గొయ్యిలోకి వచ్చి నిలబడిన వాళ్ళే బతుకుతారు" అని చిట్టెలుక గట్టిగా అరిచింది.

"నువ్వు చెప్పేదంతా నిజమేనంటావా?" అని బాబీ మళ్ళీ అడిగింది.

"ఇదేమిటి? నువ్వు సృష్టికర్తయైన తూహాన్‌నే తల్లకిందులు చేస్తావేమిటి? బాగుందిలే నీ సంగతి! అబ్బా! ఎంత గడసరివై పోయావు?" అంది చిట్టెలుక. ఈ కరుకు మాటలు వినగానే బాబీ తడబడి పోయి చిట్టెలుకతో "అయితే నేనూ ఈ పవిత్రమైన సున్నపు గొయ్యిలోకి వచ్చేస్తాను. రానిస్తావా?" అంది బాబీ.

"అయ్యో! నన్నేం చేయమంటావు? పరిశుభ్రంగా వుండే వాళ్ళే ఈ గొయ్యిలోకి రావాలి. మురికి వాళ్ళు రాకూడదు. తెలిసిందా?" అంది కాంట్చిల్ చిట్టెలుక.

"నేను శుభ్రంగానే వున్నాగా? ఇంకా చూడు కావాలంటే" అంది బాబీ.

"అబ్బే, ఎప్పుడు చూసినా, నువ్వూ నీ తుమ్ములూ తయారాయె! నాకు తెలియదేమిటి నీ తుమ్ములగోల! ఈ పవిత్ర స్థలంలో ఎవ్వరైనా సరే, తుమ్మటానికి వీల్లేదు" అంది చిట్టెలుక.

"ఇదిగో! నా మాట కాస్త విను. ఇంక నేను తుమ్మనే తుమ్మనని ప్రమాణం చేసి చెబుతున్నా, సరేనా?" అంది బాబీ.

'కాంట్చిల్' చిట్టెలుక, అరటిఆకు మళ్ళీ పుస్తకం లాగా పట్టుకుని గొప్పగా చదవటం మొదలుపెట్టింది. "ఈ పవిత్ర స్థలంలో ఎవరైనా తుమ్మితే, వారిని వెంటనే బయటికి తోసి వెయ్యాలి" అని తూహాన్ ఆజ్ఞ. "ఇప్పుడైనా నీకు తెలిసిందా?" అని చిట్టెలుక బాబీతో గంభీరంగా పల్కింది.

"అబ్బా! ఎన్నిసార్లు చెప్పమంటావు? నేను ఒక తుమ్ము కూడా తుమ్మను. నా మాట నమ్ము. ఇదిగో నీ దగ్గరకు వచ్చేస్తున్నా ఇప్పుడే" అని బాబీ కూడా సున్నపు గొయ్యిలోకి దూకింది.

చిట్టెలుక యథా ప్రకారం చదవటం ప్రారంభించింది. అదే సమయానికి 'మట్‌జన్' అనే పులి గొయ్యి దగ్గరకు వచ్చింది.

'మట్‌జన్' కూడా అడవిపంది బాబీలాగే "ఎవరక్కడ? తూహాన్ దేవుని పేరు స్మరిస్తున్నారు?" అని అడిగింది.

"ఇవ్వాళ కల్పాంత దినమని నీకు తెలియదూ?" అని బాబీ మట్‌జన్ పులిని అడిగింది.

"మన చిట్టెలుక కాంట్చిల్ పవిత్ర గ్రంథం చదువుతూంటే నీకు వినబడటం లేదూ?" అంది బాబీ.

"అది సరే కానీ, మీరిద్దరూ ఆ గోతిలో ఎందుకు దాక్కుంటున్నారో నాకు కూడా కాస్త చెప్పండి" అని అడిగింది పులి.

"పవిత్రమైన ఈ గోతిలో ఉన్నవాళ్ళు మాత్రమే, ఈ వేళ ప్రళయంలో నశించిపోకుండా బతికి వుంటారు" అని ఆ అరిటాకు పుస్తకంలోంచి చిట్టెలుక మళ్ళీ చదివింది.

"అందుకనే మేమిద్దరం ఈ పవిత్రమైన సున్నపుగొయ్యిలోకి వచ్చాం. తెలిసిందా?" అంది బాబీ పంది.

"ఓహో! అలాగా? అయితే నేనూ మీ దగ్గరికి వచ్చేస్తాను" అంది పులి.

చిట్టెలుక తనతో తుమ్మకూడదని చెప్పినమాటలన్నీ బాబీ పంది పులితో చెప్పింది. "కానీ నువ్వు ఈ పవిత్రస్థలాన్ని నీ తుమ్ములతో అపవిత్రం చేయటానికి వీలులేదు. తెలిసిందా?" అని గట్టిగా చెప్పేసింది.

మట్‌జన్ పులి తుమ్మనని ఎట్లాగో వాళ్ళిద్దరికీ నచ్చజెప్పి, ప్రాణం కాపాడుకుంటం కోసం తను కూడా ఆ గొయ్యిలోకి తూకింది.

చిట్టెలుక మళ్ళీ చదవటం ప్రారంభించింది. ఈ సారి 'కట్‌జా' అనే యేనుగు గొయ్యిలోకి తొంగి చూసింది.

"తూహన్ దేవత పవిత్రమైన పల్కులు చదువుతున్నారెవరక్కడ?" అని అడిగింది.

కూర్చున్నాక, చిట్టెలుక మళ్ళీ అరటి ఆకుని పుస్తకంలాగా పట్టుకుని చదివి, కట్‌జా ఏనుగుని చూస్తూ "నువ్వు ముందు బయటికి నడు. నీ ముఖ వాలకం చూస్తే నీకు ఇప్పుడే తుమ్ము వచ్చేటట్టుంది" అంది.

"నాకేమీ తుమ్ము రావటంలేదు. చూడు కావాలంటే. ఇప్పుడు నేను నా తొండం మీద నిలబడతాను. అంటూ తొండం మీద అమాంతంగా లేచి నిలబడింది ఏనుగు.

చిట్టెలుకకి అరటి ఆకు పుస్తకం చూసి చదవటం తప్ప మరోపని కనబడటం లేదు.

"అదిగో ఏమిటా శబ్దం? ఎవరైనా తుమ్మారా? అంది చిట్టెలుక పులికేసి చూసి.

"నీకేం చాదస్తం! నేనేమీ తుమ్మలేదు. కాస్త గట్టిగా ఊపిరి విడిచాను అంతే. దీనికేనా ఇంత గడబిడ చేస్తున్నావు?" అంది పులి.

చివరికి చిట్టెలుకకే కళ్ళు తేలిపోతున్నాయి. తుమ్ము ఎక్కడ వచ్చేస్తుందో అనే భయంతో ముక్కు గట్టిగా పట్టేసుకుంది. ఎంత ముక్కు పట్టుకున్నా తుమ్ము రాకుండా తప్పింది కాదు.

చివరికి చిట్టెలుకకే కళ్ళు తేలిపోతున్నాయి. తుమ్ము ఎక్కడ వచ్చేస్తుందో అనే భయంతో ముక్కు గట్టిగా పట్టేసుకుంది. ఎంత ముక్కు పట్టుకున్నా తుమ్ము రాకుండా తప్పింది కాదు. "ఆట్ఛీ!!!" అని తుమ్మేసింది చిట్టెలుక. ఇంకేముంది? కొంప మునిగిపోయిందన్నమాటే! సున్నపుగొయ్యిలో చేరిన తక్కిన జంతువులన్నీ చిట్టెలుక తుమ్మి, ఆ పవిత్రస్థలాన్ని అపవిత్రం చేసి పారేసిందని ఒక్క పెట్టున గగ్గోలు పెట్టేశాయి.

మట్‌జన్ పులి, బాబీ పంది కూడా ఒకేసారి "ఇవాళ ప్రళయం రాబోతూంది. ఈ పవిత్రమైన గోతిలో ఉన్నవాళ్ళు మాత్రమే ఈ ప్రళయాన్ని తప్పించుకొని బతుకుతారు" అని చెప్పాయి.

"అలాగా! అయితే నేనూ మీతోపాటు ఆ గొయ్యిలోకి వచ్చేస్తాను" అంది ఏనుగు.

"అమ్మయ్యో నువ్వు వద్దుబాబు. నువ్వు మా దగ్గరకు రావద్దు. నీ పర్వతాకారం, బ్రహ్మాండమైన తుమ్ములూ ఇక్కడ పనికిరావు. పైగా నువ్వు ఎంతో గట్టిగా తుమ్ముతావు. చిన్న తుమ్ముకే ఈ పవిత్రస్థలం మైలబడిపోతుంది. ఇంక నీ భయంకరమైన పెద్ద తుమ్ము సంగతి చెప్పాలా? నువ్వుమాత్రం మా దగ్గగరకు రావద్దబ్బా" అన్నారు.

"నేనేమీ తుమ్మనులెండి. భయపడకండి" అంటూ ఆ ఏనుగు కూడా సున్నపుగొయ్యిలోకి దిగింది. అందరూ సున్నపు గొయ్యిలో గుంపుగా

"ఆట్ఛీ!!!" అని తుమ్మేసింది చిట్టెలుక. ఇంకేముంది? కొంప మునిగిపోయిందన్నమాటే!

సున్నపుగొయ్యిలో చేరిన తక్కిన జంతువులన్నీ చిట్టెలుక తుమ్మి, ఆ పవిత్రస్థలాన్ని అపవిత్రం చేసి పారేసిందని ఒక్క పెట్టున గగ్గోలు పెట్టేశాయి.

'తుహన్' దేవుని ఆజ్ఞను చిట్టెలుక అతిక్రమించిందని కోపం వచ్చి, అన్నీ కలిసి ఆవేశంతో ఆ చిట్టెలుకను పట్టుకొని సున్నపుగొయ్యిలోంచి విసిరి బయట పారేశాయి.

కాంట్చిల్ చిట్టెలుక ఆ సున్నపు గోతిలోంచి బయటపడి బ్రతుకు జీవుడా! అనుకుంటూ, నవ్వుకుంటూ పారిపోయింది.

ఇండోనేషియా కథ

అనువాదం : కనకదుర్గా రామచంద్రన్

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్ళు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయెచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహ పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా: మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-20

■ **సృజన**

వివాహ వ్యవస్థలో వివిధ మార్పులు చోటు చేసుకొంటున్నప్పటికీ స్త్రీ పురుష సమానత్వానికి పెళ్లి బహుదూరంగానే ఉంది. పెళ్లి అన్నది వరుడికి, అతని తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు వేడుక కాగా అమ్మాయికి, ఆమె తల్లితండ్రులకు అది చెలగాటమే. శ్రమ, ఒత్తిడి, ధనవ్యయం వంటి భారాలన్నీ పెళ్లి కూతురు కుటుంబంపైనే ప్రధానంగా ఉంటున్నాయి. పెళ్లి వేడుకలు ముందుగానే తరలొచ్చిన బంధువులతో రోజుల తరబడి జరగకున్నా ఖర్చుకు మాత్రం లోటు లేదు. అది క్రమంగా అవధులు దాటుతోంది. ఆ ధోరణి అన్ని తరగతుల్లోకి ఆందోళనకరంగా విస్తరిస్తోంది. మధ్యలో వెనుకపట్టు పట్టిన ఆచారాలు, దుబారా మళ్లీ ప్రవేశిస్తున్నాయి. అమ్మాయి పెళ్లి అయిపోగానే హమ్మయ్య అనుకొనే స్థితి తల్లిదండ్రులకు మునుపూ లేదు ఇప్పుడూ లేదు. వరకట్నానికి తోడు పండుగపబ్బాలు, ప్రసవాలు తదనంతర కార్యక్రమాల భారం కూడా అమ్మాయి తల్లిదండ్రులదే. అమ్మాయికి పెళ్లి చేస్తే గుండెల మీద నుండి భారం దిపుకొన్నట్లు తల్లిదండ్రులు భావిస్తారన్న భావన కూడా పాక్షిక సత్యమే. పురుషాధిక్యతకు, కులం కొనసాగింపునకు పెళ్లి ఒక సాధనంగా ఉపయోగపడ్తోంది.

పెళ్లి – కులం – మహిళ

పెళ్లి తేది దగ్గర్లోనే ఉన్నప్పటికీ నిశ్చితార్థం అన్నది నేడు తప్పని తంతుగా మారింది. మధ్య తరగతిలో కొంతమంది ఆదాయాలు ఐటి, రియల్ ఎస్టేట్ తదితరవ్యాపారాల వల్ల పెరిగాయి. అలా ఆదాయాలు పెరిగింది కొందరికయితే పెళ్లి ఖర్చులు మాత్రం అందరికీ పెరిగాయి. నిశ్చితార్థం సందర్భంగా ఖర్చునంతటినీ అమ్మాయి కుటుంబమే భరించాలి. పెళ్లిచూపుల దశ నుండీ ఖర్చు ప్రధానంగా అమ్మాయి కుటుంబానిదే. అబ్బాయి తరపువారికి ఆటవిడుపులు అమ్మాయి కుటుంబానికి ఖర్చులూ, చేదు అనుభవాలు. పెళ్లిళ్లు కాదు కదా ఇంటివాకిట్లో నిశ్చితార్థాలు జరపడం కూడా నామోషీగా మారింది. పెళ్లి మండపాల అద్దెలు లక్షల్లోకి చేరాయి. లాభసాటి వ్యాపారం కనుక చిన్న పట్టణాల్లోనూ మేరేజిహాల్స్ బోలెడన్ని వస్తున్నాయి. నగరాలకు దూరంగా ఉండే రిసార్టుల్లో పెళ్లి చేయడం సంపన్నుల లేటెస్ట్ ఫ్యాషన్. తిన్నా తినకున్నా చెప్పలేనన్ని రకాల వంటకాలు మరో ఫ్యాషన్. ఈ ఖర్చు అవసరమా అని మాటవరసకైనా అనడానికి వధువు కుటుంబం సాహసించలేక పోతోంది. పెరిగిన పెళ్లి ఖర్చులకు తోడు పెళ్లి రోజుకు ముందు మెహందీ, సంగీత్ వంటివి ఉత్తరాది నుండి వచ్చి చేరాయి. పోటీలు పడి అట్టహాసంగా వీటిని కూడా జరుపుతున్నారు. డాబు కోసం పెళ్లి వారు, వెళ్లకపోతే సంబంధాలు చెడిపోతాయేమోనని బంధుమిత్రులు తమ సమయాన్ని డబ్బును వృథా చేసుకొంటున్నారు. అడ్డగోలుగా అక్రమ పద్ధతుల్లో డబ్బు సంపాదించిన వారు తమ సంపదను చూపుకోవడానికి, నల్లడబ్బును వినియోగించడానికి పెళ్లి మీద ఖర్చు చేస్తున్నారు. ఆ ప్రభావం సామాన్య కుటుంబాలపై కూడా పడ్తోంది. తమ స్నేహితురాళ్ల నుండి వచ్చే ఒత్తిడికి తలొగ్గి వధువులు తమను మురిపెంగా చూసుకొనే తల్లిదండ్రులపై అలకపానుపు అస్త్రాలు సంధిస్తున్నారు.

పెళ్లికి బోలెడన్ని ఈవెంట్ మేనేజిమెంట్ సంస్థలొచ్చేశాయి. డబ్బును వెదజల్లగలిగితే అవి కొండ మీది కోతిని తెచ్చి ముందుంచుతాయి. ఈవెంట్ మేనేజ్మెంట్ నేడు సినిమాలకు ఇతి వృత్తమైందంటే 'పెళ్లి' ప్రయాణిస్తున్న మార్గం ఎలా ఉందో అర్థం కోసుకోవచ్చు. డాబు ఆహ్వానలేఖ దగ్గర నుండి మొదలవుతుంది. ఒక్క ఆహ్వానలేఖపై వందలు, వేల రూపాయలు వెచ్చిస్తున్న వారు బయల్దేరారు. పది రూపాయలకు లోపు ఖర్చయ్యే ఆహ్వానలేఖ వేసేవారు 'బిపిఎల్' కుటుంబంగా భావించే పరిస్థితులు వచ్చేశాయి. కర్నాటక ప్రభుత్వం పెళ్లి ఖర్చుపై పరిమితి విధిస్తూ ఒక చట్టమే చేసింది. దేశ వ్యాప్తంగా కూడా ఒక చట్టం కావాలి. చట్టం దీనికి పూర్తి పరిష్కారం కాదు. పెళ్లి ఖర్చుల తగ్గింపునకు ఒక ఉద్యమం కావాలి. ఇందులో యువతీయువకులే పాత్రధారులు కావాలి.

ఐటి.తదితర ఎక్కువ జీతాలు పొందగల ఉద్యోగాలు, వ్యాపారాలు మన సమాజంలో కొన్ని మార్పులు తెచ్చిపెట్టాయి. అందులో ఒక మార్పు యువతీయువకుల ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యత పెరగడం. పెళ్లి ఎవరితో జరగాలి, ఎలా జరగాలి అన్న విషయంలో తల్లిదండ్రుల పాత్ర క్రమంగా తగ్గుతోంది. ఇది అభ్యుదయకరమే, ఆహ్వానించదగిందే. అయితే అదే సందర్భంలో పెళ్లి వేడుకగా జరగాలన్న ధోరణి పెరగడం వాంఛనీయం కాదు. వధూవరులు మంచి జీతాలు గల ఉద్యోగాలు చేస్తుండటం ఖర్చులు మేము భరించగల స్థితిలో ఉండగా పెద్దలకెందుకు అభ్యంతరం అన్న ధోరణి ఇందుకు ఒక కారణం. ఈ మార్పు సమాజమంతటా ఒకే తీరుగా లేదు. ఏ పరిణామం కూడా అలా ఉండదు. కులాంతర, మతాంతర పెళ్లిళ్లకు సిద్ధపడే యువత కూడా అట్టహాసాల దగ్గర వాస్తవిక దృష్టితో ఆలోచించడం లేదు. ఈ ప్రభావం అల్పాదాయ కుటుంబాల మీద పడి వారు గిలగిలలాడుతున్నారు. ఈ ధోరణి వల్ల ఏర్పడే భారం వధువు కుటుంబంపై కొన్ని రెట్లు అధికంగా పడుతోంది. అందుకే పెళ్లి విషయంలో యువతీయువకుల దృష్టిలోనే మార్పు రావడం ఎంతో అవసరం. తండ్రి ఆస్తిలో మహిళలకు వాటా రావాల్సింది ఇలా తగలేసుకోవడానికి కాదు.

కులాంతర పెళ్లిళ్లు పెరుగుతున్నా, విందు భోజనాల దగ్గర కుల పట్టింపులు చాలా వరకు చెదిరిపోయినా 'కులం' పాత్ర పెళ్లిలో ప్రబలంగానే ఉంది. కులంలోనే పెళ్లి జరగాలన్న పట్టుదల పోలేదు. సంపన్నులకంటే కింది వారిలోనే కులం పట్టుదల మూర్ఖంగా ఉంటోంది. కులాంతర పెళ్లిళ్లు నగరాలకు మాత్రమే ప్రధానంగా పరిమితమవుతున్నాయి. కులాంతర పెళ్లిళ్లు చేసుకొన్న జంటలు గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో బంధుజనం మధ్య బ్రతకడం కష్టంగానే ఉంది. దళిత యువకుడు పైకులం అమ్మాయిని పెళ్లాడిన కేసుల్లో చాలా వరకు యువకుడి కుటుంబం సర్దుబాటు చేసుకొని రాకపోకలు సాగించినా యువతి తల్లిదండ్రులు తమ కూతురు చనిపోయిందని దుర్మార్గపు ఉపశమనం పొందడానికి ప్రయత్నిస్తుంటారు. వరకట్నం, పెళ్లి ఖర్చుల బాధలు భరించలేని శూద్ర కులాల వారు కూడా తల తాకట్టు పెట్టయినా మా అమ్మాయికి పెళ్లి కులంలోనే చేసి ఉండేవాణ్ణి, ఏం చేస్తాం వాడే (అల్లుడు) ఏదో మంత్రం వేశాడని తమ బంధువుల దగ్గర వాపోతుంటారు. ఆస్తులుపోయి ఉద్యోగాల మీద ఆధారపడిన బ్రాహ్మణ కుటుంబాల ప్రతిస్పందన దీనికి భిన్నంగా కన్పిస్తుంది. ఇద్దరూ ఇష్టపడి వారంతట వారు పెళ్లి చేసుకొంటే ఛాందసులైనా, పేదలయితే లోలోపల సంతోషిస్తారు. ఆదిలో కోపం ప్రకటించినా త్వరలోనే కలిపేసుకొంటారు. ఈ రోజుల్లో ఇవన్నీ మామూలే. కులం పేరు చెప్పి అమ్మాయిని దూరం చేసుకొంటామా అని అంటుంటారు. ఇక్కడ ఆర్థిక పరిస్థితి ప్రధాన పాత్ర పోషిస్తుంది.

గతంలో జరిగిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఒక బ్రెజిల్ సినిమా ప్రదర్శించారు. సినిమాలో ఒక మధ్య తరగతి రైతు ఉంటాడు, కనా కష్టంగా బతుకీడ్చుతుంటాడు, పొలం పనుల్లో తోడుగా ఉంటాడని ఒక యువకుడిని పాలేరుగా పెట్టుకొంటాడు. కూతురుకు పెళ్లి చేయాలి, కాని కనీసం విందుకైనా డబ్బులు కూర్చుకొనే స్థితిలో ఉండడు. తన ఎద్దును కోసి ఆహ్వానితులకు కూతురు పెళ్ళి విందివ్వాలి. ఉన్న ఎద్దు ఇలా మాయమైతే తర్వాత సంసారమెలా అని చింతిస్తుంటాడు. ఈలోగా పాలేరు, రైతు కూతురు ప్రేమలో పడతాడు, తానే పెళ్లి చేయాల్సి వస్తే గొడ్డును కోయక తప్పదు, కనుక నా కూతురును నీకిచ్చి పెళ్లి చేసేది లేదని రైతు చెప్పేస్తాడు. ఇక వేరే దారిలేక యజమాని కూతురును పాలేరు ఒక అర్ధరాత్రి లేపుకెళ్తాడు. ఇది గమనించిన రైతు భార్య కంగారుపడి భర్తను నిద్రలేపుతుంది. రైతు మాత్రం ఎలాంటి కంగారు లేకుండా 'మన ఎద్దు మనకు మిగిలింది సంతోషపడు' అంటూ మళ్లీ ముసుగు తన్ని నిద్రలోకి జారు కొంటాడు. బ్రెజిల్ చిత్రమైనా భారతీయ పరిస్థితులకు కూడా ఆ సినిమా సరిపోతుంది.

'పరువు హత్యల' వార్తలు ఉత్తరాదిలో ఎక్కువ కన్పించినా మనదగ్గర కూడా ఆ ధోరణి బలంగానే ఉంది. ఇటీవలే అనంతపురం జిల్లాలో కులాంతర వివాహం చేసుకొందని ఒక యువతిని ఆమె కుటుంబం వారే దారుణంగా చంపేశారు. అప్పుడప్పుడు మన దగ్గర కూడా ఇలాంటి దుర్మార్గాలు పత్రికలకెక్కుతూనే ఉన్నాయి. 'పరువు హత్య' అన్న పదమే నిజానికి సరైనది కాదు. అది పరువు కోసం జరుగుతున్న హత్య కాదు. కుల దురహంకారంతో తన కడుపులో తానే చిచ్చు పెట్టుకోవడం. కనుక దాన్ని పరువు హత్య అనడంకంటే 'కుల దురంహంకార హత్య' అని చెప్పడం కరెక్టు. కులం అన్న భావన ఇప్పటికీ ఎంత బలీయంగా ఉందో దీన్ని బట్టి తెలుసుకోవచ్చు. దాదాపు ఏడాది క్రితం తెలుగులో కులాంతర వివాహాన్ని సమర్థిస్తూ 'గౌరవం' అనే సినిమా వచ్చింది. చాలా చక్కటి సినిమా. దానికి రావాల్సిన ఆదరణ మాత్రం రాలేదు.

భూ యాజమాన్యాలు మారిన తర్వాత వర్ణవ్యవస్థలో కూడా మార్పులొచ్చాయి. ఆధిపత్య కులాలది పైచేయి అయింది. పెళ్లిళ్లలో కూడా అది కన్పిస్తుంది. ఆస్తులు, సంపదలు ఎవరి వద్ద ఉంటే పెత్తనం సహజంగానే వారికి దక్కుతుంది. ఆధిపత్య కులాల వారు బ్రాహ్మణులతో వియ్యమొందితే ఆ విషయాన్ని గొప్పగా చెప్పుకొనే ధోరణి కూడా ఉండటం లేదు. మాకు కుల పట్టింపు లేదు. బ్రాహ్మణులతో వియ్యమొందడానికి కూడా మేము సిద్ధపడ్డామని చెప్పుకొంటున్నారు. దీనికి కారణం ఆస్తి పాస్తులు, ఆదాయం కూడా పెళ్లిళ్లలో తనవంతు పాత్ర పోషించడమే. ఆస్తుల విషయంలో మరో విషయం కూడా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. కేవలం భూమి మీదే ఆధారపడి జీవించే మధ్య తరగతి రైతుల ఇళ్లల్లో యువకులకు పెళ్లికూతుళ్లు దొరకడం కష్టమైంది. వ్యవసాయం మీదే ఆధారపడి గ్రామాల్లో బ్రతికే కుటుంబాల యువకులకు పెళ్లి కూతుళ్లు దొరక్క వేచి ఉండాల్సి వచ్చింది. చిన్నదో పెద్దదో ఓ ఉద్యోగం లేదా ఇతర ఆదాయ మార్గాలుంటే పెళ్లి కూతుళ్లు సిద్ధపడ్తున్నారు. వ్యవసాయరంగ దుస్థితిని ఈ పరిణామం తెలియచేస్తోంది. ఇళ్ల దగ్గర పెళ్లిళ్లు దాదాపు ఆగిపోయినప్పటికీ, గుడుల దగ్గర పెళ్లిళ్లు జరుగుతున్నాయి. పేదల్లో ఈ ధోరణి పెరిగినట్లు కన్పిస్తుంది. దీనికి కారణం భక్తి పెరగడం కాదు. గుడుల దగ్గర పెళ్లిళ్లు తక్కువలో అయిపోతాయి. దేవుడి ముందు పెళ్లి గనుక, ఇదేం పెళ్లి అని సణుక్కునేవారు నోటితో ఆ మాట అనడానికి సందేహిస్తారు. మనస్సులో మెదిలిన భావన భగవంతుడికి చేరదా? చేరొచ్చేమో అన్న అనుమానంతో ఎవరూ చూడకుండా లెంపలేసుకొని ఊరటపడ్తారు.

వంశం, రక్తం అన్న అశాస్త్రీయ భావం బలీయంగా ఉంది. పెళ్లిళ్లు ఒకే కులం మధ్య, కొన్ని కుటుంబాల వారి మధ్య మాత్రమే జరుగుతుండటం వల్ల పిల్లల జీన్స్‌లోనే బలహీనతలు ఉంటున్నాయని శాస్త్ర పరిశోధనా సంస్థలు నిర్ధారించాయి. కేవలం మేనరికమే కాదు ఒకే కులంలోని పరిమిత కుటుంబాల మధ్య జరిగే పెళ్లిళ్ల వల్ల పిల్లలు అనేక లోపాలతో పుడుతున్నారని అధ్యయనాలు వెల్లడించాయి. ఈ ధోరణి ఆదివాసీలకు మాత్రమే పరిమితమై లేదు, అన్ని కులాల్లోనూ ఉంది. ఆదివాసీలు సంఖ్య రీత్యా మరీ తక్కువ. పైగా వారిలోనే తెగలవారి కట్టుబాట్లు మరింత కఠినంగా ఉంటాయి. కనుక ఆదివాసీల జీన్స్ వేగంగా బలహీన పడ్తున్నాయి.

కులంలో జరిగే పెళ్లిళ్లు భారతీయులను బలహీనం చేస్తున్న విషయాన్ని అంబేద్కర్ గుర్తించారు. మెజారిటీ భారతీయులు సైనిక ఉద్యోగాలకు దీనివల్లే అనర్హులయ్యారని ఆయన పేర్కొన్నారు. భారత సమాజం ముందుకెళ్లాలన్నా, కుల నిర్మూలన జరగాలన్నా కులాంతర పెళ్లిళ్లు జరగాలన్నారు. దళిత కుల సంఘాలు కూడా ఈ విషయం అంగీకరిస్తాయి. కులాంతర పెళ్లిళ్లు జరగాలని ప్రబోధిస్తాయి, కాని దళితుల్లోనే ఉన్న వివిధ కులాల మధ్య పెళ్లిళ్లు చేయడానికి పని గట్టుకొని పూనుకోవడం లేదు. అంబేద్కర్ పేరును జపిస్తూనే ఆయన సూచించిన ఒక ముఖ్యమైన ఆచరణకు పూనుకొనక పోవడం విచారం కల్గించే అంశం. దళిత కులాల్లో ఒక కులం వాడికి మంత్రి పదవివస్తే

మరొక కులం వాడు తనకేదో అన్యాయం జరిగిందనే దురదృష్ట పరిస్థితులు నేడు నెలకొన్నాయి. ఈ స్థితిలో మార్పు రావాలంటే వివిధ దళిత సంఘాలే కాదు, తమ పట్ల ఇతరులు చూపుతున్న సామాజిక వివక్ష పోవాలని భావించే కుల సంఘాలన్నీ, పనిగట్టుకొని కులాంతర పెళ్లిళ్లకు పూనుకోవాలి. పెళ్లిళ్లలో అన్ని కులాల వారు ఒక చోట నిలబడి తింటుంటే మరోవైపు వన భోజనాల స్థానంలో విస్మయం కల్గించే కులభోజనాలు వచ్చాయి. అవి ఏదో ఆటవిడుపుకు, సరదాకు మాత్రమే పరిమితమై జరగడం లేదు. ఎవరికి వారు తమ కులం ఎంత గొప్పదో, ఎంత పురాతనమైందో, ఎందరు మహనుభావులు తమ కులంలో ఉన్నారో ఉదహరిస్తూ వన భోజనాల్లో ప్రసంగాలు సాగుతున్నాయి. ఫలానా మహా మునులు తమ మూల పురుషులంటూ బ్రహ్మండమైన పరిశోధనలు చేసినట్లు చెప్పుకొంటున్నారు. రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం కుల దురంహంకారానికి ఆజ్యం పోస్తున్నారు. వర్ణవ్యవస్థ వల్ల కొందరికి దక్కిన సామాజిక పెత్తనాన్ని గట్టిగా వ్యతిరేకించిన కులాలు కూడా కులభోజనాల ఒరవడిలో పడి కొట్టుకు పోతున్నాయి. ఈ ధోరణి పెళ్లిళ్లలో వాంఛనీయ మార్పులకు సహజంగానే అడ్డుపడ్తోంది. కుల భోజనాల స్థానంలో కులరహిత పెళ్లిళ్ల ఉద్యమం రావాలి. పెళ్లిళ్లలో అనవసర ఆడంబరాలు తగ్గాలి. వరకట్న దురాచారాలు పురుషాధిక్యత అంతరించాలి, కులం, మతం, పెళ్లికి ఆటంకం కారాదు. పెళ్లి అన్నది కులరహిత సమాజానికి ఒక సాధనం కావాలి. వ్యక్తులు, సంఘాలు తలోచేయి వేస్తే ఇది సాధ్యమే.

- ఎస్. వినయకుమార్

నెమలీక

స్నేహితులు

రంగాపురంలో రాజేశం, సోమేశం పక్కపక్క ఇళ్ళలో ఉండేవారు. వాళ్ళిద్దరూ చిన్ననాటి నుండి ప్రాణ స్నేహితులు. వారిద్దరి పొలాలు కూడా పక్కపక్కనే వుండేవి. ఒకరోజు పొలంలో ఎరువులు వేయడానికి ఎరువులు అవసరమయ్యాయి. వాళ్ళిద్దరూ ఎరువులు తీసుకురావడానికి పట్నం బయల్దేరారు. దగ్గర దారని, చీకటి పడేసరికి ఇంటికి చేరుకోవచ్చని అడవి మార్గం గుండా ప్రయాణించసాగారు.

మిత్రులిద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ ఆడుతూ, పాడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. వాళ్ళు ప్రయాణిస్తున్నది పెద్ద జంతువులు లేని చిన్న అడవే అయినా ముందు జాగ్రత్తగా కర్ర పట్టుకుని నడుస్తున్నారు.

కబుర్లాడుకుంటూ నడుస్తున్న రాజేశంకి దారిలో ఒక బంగారు వుంగరం కనిపించింది. దాన్ని చేతిలోకి తీసుకుని చుట్టూ చూశాడు, ఆ ఉంగరం ఎవరైనా పోగొట్టుకున్నవాళ్ళు కనిపిస్తారేమోనని. కనుచూపు మేరలో ఎవరూ కనిపించకపోయేసరికి దాన్ని ఆనందంగా తన వేలికి పెట్టుకున్నాడు. ఉంగరం దొరికిందన్న ఆనందంతో మాటలు రావడం లేదు రాజేశానికి. సోమేశం కూడా మౌనంగా నడుస్తున్నాడు. ఇద్దరూ ఒకరితో మరొకరు మాట్లాడకుండా ఎవరి ఆలోచనలో వాళు ళ్నారు.

తనకు దొరికిన ఉంగరం అమ్మేస్తే ఈ సంవత్సరం తన పంట పెట్టుబడికి డబ్బు సమకూరుతుంది అని ఆలోచించసాగాడు రాజేశం. సోమేశం ఆలోచనలు వేరేగా ఉన్నాయి. స్నేహితుడికి పట్టిన అదృష్టానికి ఈర్ష్యపడసాగాడు. అదే వుంగరం తనకు దొరికితే ఎంత బాగుండేది అని ఆలోచించసాగాడు.

ఇలా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మౌనంగా నడుస్తుండగా... ఉన్నట్టుండి పక్కనే ఉన్న పొదలోనుంచి పెద్దతాచుపాము వారి ముందుకి వచ్చింది. మరో అడుగు వేస్తే రాజేశాన్ని పాము కాటేసేదే. అదే సమయంలో రాజేశం కూడా పామును చూసి వెంటనే తేరుకుని, స్నేహితుణ్ని పక్కకు లాగాడు. క్షణంలో ఎంత గండం గడిచింది అనుకున్నారు ఇద్దరూ.

“నేనంటే నాకు దొరికిన ఉంగరంతో ఎంత లాబమొస్తుందా అని ఆలోచిస్తున్నాను. మరి నువ్వేం చేస్తున్నావు పామును చూసుకోకుండా...” అని స్నేహితుణ్ణి విసుకున్నాడు రాజేశం.

“ఆ ఉంగరం నాకు దొరికితే ఎంత బాగుండేదా అని ఆలోచిస్తున్నాను” అన్నాడు నిజాయితీగా సోమేశం.

ఇంతలో ఓ వ్యక్తి కంగారుగా దారంతా వెతుకుతూ వారి ఎదురుగా వచ్చి “నా ఉంగరం పోయింది. మీకేమైనా కనిపించిందా?” అని అడిగాడు.

ఆనవాళ్ళు అడిగి తనకు దొరికిన ఉంగరం ఆ వ్యక్తికి ఇచ్చేశాడు రాజేశం. ఆ తర్వాత తిరిగి స్నేహితులిద్దరూ సంతోషంగా పాటలు, కబుర్లతో సందడిగా నడవసాగారు.

అయాచితంగా వచ్చిన డబ్బు కోసం ఆశ, ఆలోచనలు ఆనందాన్ని ఎంత పాడుచేస్తాయో స్నేహితులిద్దరికీ తెలిసింది.

హోమీ జహంగీర్ భాభా

భారతీయ అణుపరిశోధనా రంగ పితామహుడు హోమీ జహంగీర్ భాభా. ఈయన 1909, అక్టోబర్ 30న ముంబయిలో జన్మించారు. అణు భౌతిక శాస్త్రంలో ప్రసిద్ధులైన ఈయన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసుకున్నారు. సి.వి.రామన్ నేతృత్వంలో కాస్మిక్ కిరణాలపై పరిశోధన చేశారు. 1945లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌ను స్థాపించారు. భారత అణు పరిశోధన సంస్థకు తొలి చైర్మన్‌గా వున్నారు.

కాస్మిక్ రేడియేషన్ పై పరిశోధనలు జరిపి మిసాన్ అనే కణాలను కనుగొన్నారు. దీనితో వీరు విశ్వఖ్యాతి గడించారు. 1948లో ఆటమిక్ కమిషన్‌కు అధ్యక్షుడిగా ఎన్నికై భారతీయ అణుశక్తి నిర్మాణానికి రూపు దిద్దారు. దీని వలన భారత దేశం ఇతరుల మీద ఆధారపడకనే స్వంతంగా అణుశక్తి రంగంలో స్వాలంబన సాధించింది. 1963లో తారాపూర్‌లో తన మొదటి అణు రియాక్టర్‌ను భారతదేశం నిర్మించడానికి కారణం భాభానే. మరో రెండు సంవత్సరాల కాలంలోనే ప్లూటోనియం ప్లాంట్ నిర్మించి ప్రపంచాన్ని అబ్బురపరిచారు. నేడు విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించే అణు రియాక్టర్‌లలో ఫాస్ట్ బ్రీడర్ టెక్నాలజీని ఆనాడే భాభా రూపకల్పన చేశారు. అణు రియాక్టర్లను మూడు దశలలో వినియోగించుకునే విధానం రూపు దిద్దింది కూడా బాబానే. భారతదేశంలో లభించని యురేనియం ఇంధనానికి బదులు మన దేశంలో దొరికే థోరియం అనే ఇంధనాన్ని ఉపయోగించి అణుశక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చని చెప్పింది కూడా ఈయనే. 1966, జనవరి 24న ఒక విమాన ప్రమాదంలో భాభా మరణించారు.

రంగులతో అందంగా

అతికిద్దాం



విడిగా వున్న నాలుగు భాగాలు అతికించండి.

సంఖ్యామానం

ఒకటి	: 1
పది	: 10
నూరు	: 100
వెయ్యి	: 1000
పదివేలు	: 10,000
లక్ష	: 1,00,000
పది లక్షలు	: 10,00,000
కోటి	: 1,00,00,000
పది కోట్లు	: 10,00,00,000
శత కోటి	: 100,00,00,000
సహస్ర కోటి (అర్బుద్ధం)	: 1000,00,00,000
న్యాద్బుద్ధం	: 10000,00,00,000
ఖర్వం	: 100000,00,00,000
మహా ఖర్వం	: 1000000,00,00,000
పద్మం	: 10000000,00,00,000
మహాపద్మం	: 100000000,00,00,000
క్షోణి	: 1000000000,00,00,000
మహా క్షోణి	: 10000000000,00,00,000

కొన్ని నిజాలు



★ మనిషి పీల్చుకునే ఆక్సిజన్‌లో పావు భాగాన్ని మెదడే ఉపయోగించుకుంటుంది.

★ మనిషి గుండె రోజుకి లక్ష సార్లు కొట్టుకుంటుంది.

★ ఎర్ర రక్త కణాలే శరీరం మొత్తానికి ఆక్సిజన్‌ని సరఫరా చేస్తాయి. ఇవే ఎముక లోపలి మజ్జని తయారు చేస్తాయి.

★ మనిషి రంగు శరీరంలో వుండే మెలనిన్ అనే పదార్థాన్ని బట్టే వుంటుంది. మెలనిన్ పరిమాణం తక్కువగా వుంటే శరీరం తెల్లగా, మెలనిన్ పరిమాణం ఎక్కువగా వుంటే శరీరరం నల్లగా వుంటుంది.

★ పెద్దవాళ్ళలో ఊపిరితిత్తుల పరిమాణం 70 స్వేర్ మీటర్ ఉంటుంది.

★ పెద్దవాళ్ళలో ఎక్కువ మందికి 32 దంతాలుంటాయి.

★ మనిషిలో అతి చిన్న ఎముక మధ్య చెవిలో వుంటుంది. దీని పొడవు 2.8 మిల్లీమీటర్లు.

★ జుత్తు, గోర్లు మనిషి జీవితాంతం పెరుగుతూనే ఉంటాయి.

★ చిన్నపిల్లలైతే నిముషానికి ఒకటి లేదా రెండు సార్లు కళ్ళు ఆర్పుతుంటారు (రెప్పలు కొట్టడం). పెద్దవాళ్ళు నిముషానికి పది సార్లు రెప్పలు కొడుతుంటారు.

★ మనిషి వేలి ముద్రలు ఎలాగైతే ఒక దానితో మరొకటి పోలిక వుండదో, నాలుక ముద్రలు కూడా అంతే.

★ మనిషి శరీరంలో ఎడమవైపు భాగం యొక్క నియంత్రణ కుడి మెదడు, కుడి వైపు శరీర భాగం నియంత్రణ ఎడమ మెదడు చేస్తుంది.

★ మనం వాడే యాంటీ బయాటిక్ మందులు బాక్టీరియా మీదనే పని చేస్తాయి. వైరస్ మీద ఆ మందుల ప్రభావం వుండదు.

★ మనకు రుచిని గ్రహించే శక్తి కంటే వాసన గ్రహించే శక్తి పది వేల రెట్లు ఎక్కువగా వుంటుంది.



తేడాలు

ఈ రెండు బొమ్మల్లో 12 తేడాలున్నాయి. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో చూడండి.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

'న్యూ రైనిష్‌జైటుంగ్-పొలిటికల్ ఎకనామిక్ రివ్యూ' ప్రారంభించటానికి హాంబర్గ్‌లో తనకో ప్రచురణ కర్త, పంపిణీదారు దొరికాడని డిసెంబర్‌లో తన సన్నిహితుడు వైడెమియర్‌కు రాశాడు మార్క్స్. పత్రిక జనవరిలో ప్రారంభమవుతుందని ప్రకటన కూడా యిచ్చాడు.

కాని, ఎప్పుడూ వుండే డబ్బు సమస్యలవల్ల ప్రచురణ ఆలస్యమైంది. జనవరిలో రాలేదు. ఫిబ్రవరి కూడా గడిచింది. సమస్యలు పెరిగినప్పుడల్లా జబ్బుపడటం మార్క్స్‌కు మామూలే. ఈసారీ అదే జరిగింది. పత్రిక సంగతి ఇలా ఉంటే, ఇంట్లో అప్పుల వాళ్ల బాధ పెరిగింది. ముఖ్యంగా మార్క్స్‌ను చికాకుపెట్టింది. ఒక జర్మన్ డాక్టర్ జెన్నీ ప్రసవం అప్పుడు వచ్చాడు. తనను పీల్చేస్తున్నాడే డాక్టర్ అతని పై కేసు పెడతానన్నాడు మార్క్స్. అయితే, ఈ తగువుతో తనకే మరింత నష్టం జరిగింది. ఇంట్లో ఎవరికీ ముఖ్యంగా, గుయిడోకు వైద్య సహాయం లభించలేదు. మార్క్స్ ఇంటి సమస్యల్ని శరణార్థులు కథలుగా చెప్పుకున్నారు. ఇలాంటి పరిస్థితిని భరించటం కష్టం. కాని ఏమీ చెయ్యలేడు. చెయ్యిచాచకపోతే రోజు గడిచే పరిస్థితి లేదు. తనను నవ్వుల పాలు చేస్తున్న సాటి జర్మనుల మీద కోపం పెరిగింది. రచనల్లో పదును, వ్యంగ్యం కూడా రెట్టింపైంది.



"పత్రిక డబ్బులేమైనా వుంటే తక్షణం పంపించమని వేడుకుంటున్నాను. ఎంతవున్నా సరే. డబ్బు మాకు అత్యవసరం. ఇన్నేళ్లుగా మా కృషిలో మేమెంత కోల్పోయామో, ఎన్ని కష్టాలు అనుభవించామో ఎవరికీ చెప్పుకోలేదు. ఇక్కడ బూర్జువా జీవిత భారం కింద నలిగిపోతున్నాడు నా భర్త. రోజువారీ పనులు కూడా చేసుకోలేకపోతున్నాం"

చివరికి మార్చి నెలలో వచ్చింది పత్రిక. ముఖ్యమైన ఒక కొత్త వ్యాసపరంపర ప్రారంభమైంది. పేరు "ది క్లాస్ స్ట్రగుల్ ఇన్ ఫ్రాన్స్"...ఫ్రాన్సులో వర్గపోరాటం. ఇటీవలి ఫ్రెంచి తిరుగుబాటును విశ్లేషించే క్రమంలో మార్క్స్ తొలిసారిగా "కార్మికవర్గ నియంతృత్వం" అనే మాట వాడాడు(తర్వాత రోజుల్లో లెనిన్ దీన్ని పునర్‌నిర్వచించాడు). "అసలైన పూర్తి కమ్యూనిస్టు వ్యవస్థను సాధించుకునే క్రమంలోని ఒక ముఖ్య మజిలీ "కార్మికవర్గ నియంతృత్వం".

"సోషలిజమనేది శాశ్వత విప్లవ ప్రకటన. వర్గ నియంతృత్వం ఆ దారిలో ఒక మజిలీ. దీనివల్లనే వర్గ భేదాలు నిర్మూలించబడతాయి(వర్గ భేదాలకు కారణం వర్గ సంబంధాలు). దీనివల్ల ఉత్పత్తి సంబంధాలకు సంబంధించిన సామాజిక సంబంధాలు కూడా మారతాయి. సామాజిక సంబంధాల వల్ల ఏర్పడిన భావజాలంలో కూడా విప్లవాత్మకమైన మార్పు వస్తుంది".

యూరోప్‌లో పరిస్థితులు కాస్త చల్లబడటానికి కారణం కాలిఫోర్నియాలో కనిపించిన బంగారు నిల్వలన్నాడు మార్క్స్. ఈ ఆవిష్కరణతో ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే అవకాశముంది. అయితే, బంగారం సంగతెలా వున్నా, మరో ఆర్థిక సంక్షోభం మాత్రం తప్పదు. దీనివలన రాబోయే తిరుగుబాటు సమగ్రమైనది, సర్వవ్యాప్తమైనది.

పత్రికలో బూర్జువాలను సమర్థించే వాళ్లను నిర్దయగా విమర్శించాడు. తన కమ్యూనిస్టు అభిప్రాయాలలో ఎక్కడా రాజీలేదు. కార్మిక వర్గం గురించే రాశాడు. వాళ్ల కోసమే రాశాడు. ఆధునిక సమాజంలో తొలి వర్గపోరాటానికి తెర తీసింది వీళ్లే (పారిస్‌లో). ఇప్పుడక్కడ పోరాటాన్ని అణచివేసినా, తానూ, తన సహచరులూ వాళ్ల తరఫున లండన్‌లో ఆ పోరాటాన్ని కొనసాగిస్తారు.

తన అభిప్రాయాలను అందరితో పంచుకోవటానికి మంచి వేదికగా మారింది పత్రిక. దీనివలన లాభాలు వచ్చే అవకాశం లేదని ప్రారంభించక ముందే తెలుసు. దీని సంపాదకుడు (మార్క్స్) లండన్‌లో వున్నా, పత్రికల మీద కఠిన నిబంధనలున్న హాంబర్గ్‌లో వున్నాడు ప్రచురణకర్త. పునర్వ్యవస్థీకరించబడిన కమ్యూనిస్టు లీగ్ జర్మనీలో అల్లర్లకు ప్రయత్నిస్తున్నారని అధికారులకు తెలిసింది. పైగా, పత్రిక ప్రస్తుత వ్యవస్థ మీద ఎంతటి కోపం ప్రదర్శించిందంటే పెట్టుబడి పెట్టే వాళ్లే కరువయ్యారు. పంపిణీలో సమస్యలు తలెత్తాయి. కొన్ని చందాలు వసూలైనా అవి మార్క్స్‌కు చేరలేదు.

మార్క్స్ దంపతులు, ఎంగెల్స్ డబ్బులకోసం తీవ్రంగా ప్రయత్నించారు. పత్రికను ఎలాగైనా నడపాలి. కాని సమస్య ఇప్పుడు తీవ్రతరమైంది. ఒకవైపు పత్రికకు, మరోవైపు శరణార్థులకోసం డబ్బు అడుగుతున్నారు. ఇక ఇంటి పరిస్థితి చెప్పుకునేది కాదు. మార్క్స్ ఎంత రహస్యంగా వుంచాలనుకున్నా అందరికీ తెలిసిపోయింది. ప్రత్యర్థులకిది మంచి అవకాశం. మార్క్స్, అతని మనుషులు శరణార్థుల కోసం సేకరించిన విరాళాలు సొంతానికి వాడుకుంటున్నారని పుకార్లు పుట్టించారు. మార్క్స్ సేకరించిందంతా కేవలం కమ్యూనిస్టులకే ఇచ్చి మిగతావాళ్లను విస్మరించాడని కూడా ప్రచారం చేశారు. ఈ నీలి వార్తలు కేవలం లండన్‌కే పరిమితం కాలేదు. జర్మనీలోని వార్తాపత్రికల్లో కూడా దీని గురించిన కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నీలాపనిందలు చదివి మార్క్స్, జెన్నీ, ఎంగెల్స్‌లు కుమిలి పోయారే గాని చెయ్యవలసిందేమి లేదు. ప్రస్తుతానికి పరువు మర్యాదలు తప్ప పైసా లేదు.

జర్మనీలో వున్న వైడెమియర్‌కు రాసిన ఒక లేఖలో జెన్నీ యిలా వాపోయింది, "పత్రిక డబ్బులేమైనా వుంటే తక్షణం పంపించమని వేడుకుంటున్నాను. ఎంతవున్నా సరే. డబ్బు మాకు అత్యవసరం. ఇన్నేళ్లుగా మా కృషిలో మేమెంత కోల్పోయామో, ఎన్ని కష్టాలు అనుభవించామో ఎవరికీ చెప్పుకోలేదు. మా సొంత సమస్యలతో జనాన్ని ఎప్పుడూ యిబ్బంది పెట్టలేదు. నా భర్త చాలా సున్నితమనస్కుడు. ఉన్నదంతా పోగొట్టుకోవటానికైనా ఇష్టపడతాడు గాని ఒకరిముందు చెయ్యిచాచడు. మాకు డబ్బులు ఉచితంగా అక్కర్లేదు. తన కొలోన్ మిత్రుల నుండి పత్రికకు సహాయం అడిగే హక్కు నా భర్తకుంది. కాని అక్కడ, అందరూ కలిసి పత్రికను నాశనం చేశారు. ఎవరు ఎక్కువ చేశారో, ఎవరు తక్కువ చేశారో మాకైతే తెలియదు. పత్రికను అమ్మిన వాళ్లు డబ్బు పంపక పోవటమా లేక మిత్రులు వ్యాపారాన్ని సరిగా నిర్వహించలేకపోవటమా లేక డెమోక్రాట్లు వైఖరే యిందుకు కారణమా?

ఇక్కడ బూర్జువా జీవిత భారం కింద నలిగిపోతున్నాడు నా భర్త. రోజువారీ పనులు కూడా చేసుకోలేకపోతున్నాం. దినదినగండంగా, క్షణమొక యుగంలా గడుస్తున్నది..."

వైడెమియర్ కింకా ఏమైనా వివరణ కావాలనుకుంటే, తన 'జీవితంలో ఒక రోజు' గురించి ఇలా రాసింది జెన్నీ. ఇప్పటికి గుయిడోకు ఆరునెలలు. పుట్టినప్పటి నుండీ రెండు గంటలకన్నా ఎక్కువ ఎప్పుడూ నిద్రపోలేదు. అప్పుడప్పుడూ మూర్ఛలు (ఫిట్సు) వస్తున్నాయి. అది జీవన్మరణ పోరాటం. "తన బాధతో వాడు

నా రొమ్ము ఎంత గట్టిగా కొరికాడంటే గాయమై పుండు యింకా మానలేదు. అప్పుడప్పుడూ నెత్తురు వచ్చి వాడి చిన్నారి నోటిలోకి పోతోంది. ఒకసారి పిల్లాడికి పాలిస్తునప్పుడు ఇంటి యజమానురాలు వచ్చి, బాకీ వున్నామని ఐదు పౌండ్లు తక్షణం ఇవ్వమంది. ఉంటేగా ఇవ్వడానికి. పెద్దగా అరిచి నన్ను భయపెట్టి డబ్బు తీసుకోవాలనుకుంది. ఇద్దరు కోర్టు జవాన్లు ఇంట్లోకి ప్రవేశించి బెడ్, దుస్తులు, చంటివాడి ఊయల, చివరికి పిల్లల బొమ్మలు (పిల్లలు భయపడి ఎంత ఏడ్చినా) కూడా స్వాధీనం చేసుకుని రెండుగంటల్లో తీసుకుపోతామన్నారు. చలికి వణుకుతూ నేను నేలమీద పడుకున్నాను. రొమ్ముకైన గాయం సలుపుతోంది". జెన్నీ కాన్రాడ్ ష్రామ్ అనబడే మిత్రుడి సాయం కోరింది. కాని, అతడి గుర్రపు బండికి కట్టిన గుర్రాలు భయపడి పరిగెత్తాయి. అతడు కిందపడి గాయాలపాలు కావటంతో తమ యింటికే తీసుకువచ్చారు. అసలే చిక్కుల్లో వుంటే మరో మనిషికి సేవ చేయాలి.

తెల్లవారే, మార్క్స్ మరో ఇంటికి మారటానికి ప్రయత్నించాడు. కాని నలుగురు పిల్లలున్నారని చెప్పటంతో ఏ ఇంటి యజమానీ అంగీకరించలేదు. చివరికి ఒక మిత్రుడు వాళ్లను లెస్టర్‌స్క్వేర్‌లోని ఒక హోటల్‌లో వుండమన్నాడు. కాని పోలీసులు వాళ్లను ఇల్లు ఖాళీ చెయ్యకుండా అడ్డుకున్నారు. అప్పటి ఇంగ్లీషు చట్టం ప్రకారం సూర్యాస్తమయం తర్వాత ఇల్లు మారకూడదు. "ఇంటి యజమాని మావైపు అనుమానంగా చూస్తాడు. అతని వస్తువులేమైనా మా వాటిలో కలిసిపోయి వుండొచ్చునంటాడు.

ఉన్నపళంగా ఇల్లు ఖాళీ చేస్తున్నామంటే విదేశాలకు పారిపోతున్నాం అనుకుంటాడు. ఐదు నిమిషాల్లో రెండు మూడు వందల మంది పోగై మావైపు ఎగాదిగా చూస్తారు". ఇదివరకు కూడా మార్క్స్ దంపతులు అనేకసార్లు చిక్కుల్లో ఇరుకున్నారుగాని ఇంత దారుణమైన, అవమానకర పరిస్థితి ఎప్పుడూ రాలేదు. సామానంతా వీధిలో వుంది. తెల్లారి వరకు అదంతా మళ్లీ ఇంట్లోకి తెచ్చుకోవాలి.

తరువాత, మార్క్స్ దంపతులు లెస్టర్‌స్క్వేర్‌కు మారారు గాని, వారంలోగానే అక్కడా యజమాని వాళ్లను వెళ్లిపోమన్నాడు. కారణం డబ్బు సమస్యే. అద్దె యివ్వకపోతే ఎవరుండనిస్తారు.?(గుయిడో ఏడుపు వల్ల హోటల్లో వుంటున్న యితర అతిధులకు కలిగిన అసౌకర్యం మరో కారణం కావచ్చు). చివరికి, జెన్నీ తల్లి కొంతడబ్బుపంపి వాళ్లనాదుకుంది. 64, డీన్ స్ట్రీట్‌లో రెండు గదులకు మారారు మార్క్స్ దంపతులు.

ఇక, పత్రిక ఆరు ఎడిషన్లు మాత్రమే వచ్చింది. డబ్బులు లేవు. అధికారులు యిబ్బంది పెట్టారు. ప్రష్యాలో పత్రిక విక్రేతకు ప్రభుత్వం లంచమిచ్చి పంపిణీ చెయ్యకుండా అడ్డుకుందని ఆరోపించింది జెన్నీ.

డీన్‌స్ట్రీట్‌లో మార్క్స్ వుంటున్న ఇంటి యజమాని ఒక యూదు లేస్ వ్యాపారి. అతడు అంతకు ముందు ఒక గదిని లీగ్ సభ్యుడు హైన్రిష్ బార్‌కు కూడా అద్దెకిచ్చాడు. "1793లో ఫ్రాన్సులో జరిగినట్టే ఇప్పుడు జర్మనీలో జరుగుతుంది" అన్న ప్రకటనతో అతడు లీగ్ కేంద్ర కమిటీ తరపున జర్మనీకి ప్రచారం నిమిత్తం వెళ్లాడు(1793 విప్లవంలో ఫ్రెంచి రాజును శిరచ్ఛేదంచేశారు). "విప్లవం మలి దశలో ఇక అందర్నీ సాయుధుల్ని చేయటమే తరువాయి. జనం ఇక మీద బూర్జువా డెమోక్రాట్ల బృందగానాలకు చప్పట్లు గొట్టరు" అని కూడా చెప్పింది కమిటీ.

"బార్, జర్మన్ కార్మికుల్లో ప్రచారం చేస్తున్నప్పుడు యాదృచ్ఛికంగా ఒక సంఘటన జరిగింది. ఒక ఉన్మాది జర్మన్ రాజు హత్యకు విఫల ప్రయత్నం చేశాడు. జర్మనీలో బార్ చేస్తున్న ప్రచారం, కేంద్ర కమిటీ ప్రకటనలు, మార్క్స్ పత్రికలో వస్తున్న రెచ్చగొట్టే వ్యాసాలు, రిపోర్టు అన్నీ కలిసి హత్యా ప్రయత్నం వెనుక లీగ్ హస్తం వున్నదనే అనుమానం రేకెత్తించాయి. మార్క్స్ మిత్ర బృందమే యిందుకు కారణమన్నాయి ప్రష్యన్ పత్రికలు. ఒక పత్రికైతే, 'మార్క్స్ ఇటీవల బెర్లిన్‌లో కనిపించాడు' అని కూడా రాసింది(ఇది ఎంగెల్స్ కథనం).

ఈ వార్తలు ఆధారంగా ప్రష్యన్ ప్రభుత్వం ప్రమాదకరమైన తీవ్రవాదులను బహిష్కరించమని ఇంగ్లీషు అధికారులను కోరింది. బెర్లిన్‌లో ఒక బ్రిటిష్ రాయబారి, ప్రష్యన్ అంతరంగిక మంత్రిత్వశాఖ నుండి ఒక రహస్య నివేదిక అందుకున్నాడు. దానిప్రకారం "మార్క్స్ ముఠా కేవలం జర్మనీలో అల్లర్లను సృష్టించడమే కాదు. ఇంగ్లండులో మహారాణికి వ్యతిరేకంగా కూడా కుట్ర పన్నుతుంది. ఆయన వద్ద ఇరవై మంది సుశిక్షితులైన మనుషులున్నారు.

ఇలాంటి సందర్భాల్లో పోలీసులు ఎలా ప్రవర్తిస్తారో మార్క్స్, జెన్నీకి బాగా తెలుసు. వీళ్ల దృష్టి నుండి తప్పించుకోవటానికి గ్రామాల్లోకి వెళ్లిపోదామనుకున్నారు. కాని మళ్లీ అదే సమస్య డబ్బులేదు. ఇక మిగిలింది, పత్రికల్లో వస్తున్న ప్రతి బూటకపు వార్తనూ ఖండిస్తూ పోవటమే. జర్మన్‌రాజు హత్యా ప్రయత్నంతో తమకి సంబంధమున్నదనటం ఒక అభూతకల్పన అని అన్ని ప్రముఖ లండన్ వార్తాపత్రికలకు సంపాదక లేఖలు రాశారు. ఇది బ్రిటిష్ పోలీస్ ఏజెంట్ల కుట్ర అని ప్రజలకు అన్యాపదేశంగా అప్పీలు చేశారు.

ఒక నమూన లేఖ.

"అయ్యా, వారం రోజుల స్వల్ప వ్యవధిలో ఇంతమంది పోలీస్ గూఢచారులతో పరిచయం చేసుకోగలమని మేం కలలో కూడా వూహించలేదు. మేముండే ఇళ్ల మీద గట్టి నిఘా వుంది. మా ప్రతి కదిలికనూ గమనిస్తున్నారు. మా ఇంటికి వచ్చి పోయే వాళ్లందరి వివరాలూ సేకరిస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా మమల్ని వెంబడిస్తున్నారు. ఎవరో ఒక అపరిచిత మిత్రుడు వెంటలేకుండా మేం బస్సెక్కలేం. కాఫీ హోటలుకు వెళ్లలేం. ఈ పరిస్థితిలో ఇంకా ఎవరో మా మీద గూఢ చర్యలు చేయడం వల్ల ఏం ప్రయోజనముంటుంది. ఈ గూఢచారులు, ఇన్ఫార్మర్లుగా పురుషవేశ్యలు–డబ్బులకమ్ముడు పోయిన నీచమానవులు!."

ఇంగ్లీషు వాళ్లకు శరణార్థులంటే ముఖ్యంగా గడ్డం పెంచుకున్న వాళ్లంటే వీళు నాస్తికులూ అవినీతిపరులూ అని గట్టి నమ్మకం. అయినా వాళ్లందరికీ దేశ బహిష్కరణ శిక్ష విధించాలనేంత కోపం మాత్రం లేదు.(ఎవరి పాపాన వాళ్లు పోతారు. మనమెందుకు వాళ్లను గెంటెయ్యటం!) తమ సామాజిక, రాజకీయ వ్యవస్థ ఎంత పటిష్టమైనదంటే ఈ కొద్ది మంది విదేశీ రాడికల్స్ దాన్నేమీ చెయ్యలేరు. "ఇంగ్లీషు వాళ్లు రాజకీయ విభేదాలు కారణంగా ఎవరి హక్కుల్నీ కాలరాయరు" అని గర్వంగా చెప్పకుంటారు.

సంపాదక లేఖల ప్రభావమో కాదో చెప్పలేం గాని, మార్క్స్ బృందం మీద తదుపరి చర్యలేవీ తీసుకోలేదు. బహిష్కరించాలన్న ప్రష్యన్ ప్రభుత్వ లేఖకు కూడా బ్రిటిష్ అధికారులు సమాధానం పంపలేదు.

ఇంతకూ ఇంతమంది దృష్టిని ఆకర్షించిన మార్క్స్ ఎవరు? 1850 నాటి పరిస్థితులను పరిశీలిస్తే, ఆనాటికి ఆయన నాయకుడు. బహుశా, యూరోపియన్ ప్రతిపక్ష రాజకీయాల్లో ఆయన పేరెక్కడయినా వినిపించి వుండవచ్చు. పెద్దగా పేరులేని ఫిలాసఫర్, జర్నలిస్ట్. యూనివర్సిటీలో వున్నప్పుడు ఆయన ఎవర్నీ ప్రభావితం చేశాడని చెప్పలేం. ఇప్పుడైతే అసలాయన గురించి ఎవరికీ తెలిసే అవకాశమే లేదు.

అయితే, ప్రష్యన్ అధికారులకు ఆయన ఆందోళనకారుడిగా బాగా తెలుసు, త్వరలో అంతరంగిక మంత్రి కాబోతున్న తన బావమరిదికి కంటిలో నలుసు.. కాలిలో ముల్లు. ముఖ్యంగా 'మార్క్స్ బూచి' ప్రష్యన్ ప్రభుత్వానికి చాలా ఉపయోగకరం. 1848 తర్వాత, యూరోపియన్ ప్రభుత్వాలు, తిరుబాట్లకు పత్రికలే కారణమన్నాయి. గోరంత సామాజిక అసంతృప్తిని కొండంత చేసి చూపించాయి. ప్రభుత్వమంటే భయం, భక్తి వున్న అమాయక ప్రజల్ని రెచ్చగొట్టాయి. తిరుగుబాట్ల వెనుక, హింస వెనుక మార్క్స్ వున్నాడు. అతనిది కమ్యూనిస్టు పత్రిక. ప్రజల్లో అశాంతికి కారణం అతడే. అతడి గురించి ఎవరికీ ఎక్కువగా తెలియదుగనక అతణ్ని సమర్థించే వాళ్లు కూడా ఎవరూ వుండరు.

ఇక, లండన్‌లోని రాజకీయ ప్రత్యర్థులకూ, శరణార్థులకూ అతణ్ని నిందించటానికి ఎన్నోకారణాలున్నాయి. అవేవీ అతడి రచనల గురించీ, అభిప్రాయాలు గురించీ కాదు. మార్క్స్ తన స్వభావంతో, ప్రవర్తనతో చాలా మందిని శత్రువులను చేసుకున్నాడు. విప్లవకారులను రొమాంటిక్ హీరోలుగా జనం ఆరాధిస్తున్న కాలమది. ఉదాహరణకు ఇటాలియన్ జిసెపి మజని, హంగేరియన్ జోసెఫ్ కోసత్. కాని మార్క్స్‌ని ఎవరూ యిష్టపడలేదు. అహంకారి, దురుసు స్వభావం, కోపిష్టి, ఎవర్నీ దగ్గరకు రానివ్వడు. ఒకరాయన్ను 'మహాజ్ఞాని, యువ దలైలామా మార్క్స్' అంటూ అభివర్ణించారు.

(సశేషం)

■ పురస్కారం

ఆమె ఆ సినిమాకి ప్రాణం

చాలా రోజుల క్రితం తెలుగులో 'మాతృదేవోభవ' పేరుతో ఒక సినిమా వచ్చింది. మాధవి, నాజర్ ప్రధాన పాత్రధారులు. ఆ సినిమా తెలుగు ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షించింది. మాధవి అంతకు ముందు ఎన్ని సినిమాలు చేసినా, తెలుగు ప్రేక్షకులు మాత్రం ఆమెను 'మాతృదేవోభవ' మాధవిగానే ప్రేమించారు. గుర్తించారు.

తన జీవితం కూలిపోతున్నా, ధైర్యం సడలనీయక మరో మూడు జీవితాలను నిర్మించడానికి మాధవి పడిన తపన, వేదన ప్రేక్షకులను కదిలించింది. కన్నీటి ప్రవాహంగా కరిగించింది. మాతృదేవోభవ చూస్తుంటే ఎలాంటి భావోద్వేగము, వేదన కలిగాయో, మళ్ళీ ఇన్నాళ్లకి STILL ALICE సినిమా చూస్తుంటే అలాంటి భావోద్వేగము, వేదన కలిగాయి.

STILL ALICE సినిమాలో డాక్టర్ ఎలైస్ హౌలేండ్ పాత్ర పోషించిన జూలియన్ మూర్‌కి 2015 సంవత్సరానికి గాను ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డు లభించింది. అంతకుముందు ఇదే సినిమాలో ప్రదర్శించిన నటనకు, గోల్డెన్ గ్లోబ్ అవార్డు, BAFTA అవార్డును జూలియన్ మూర్ పొందింది. ఆస్కార్ అవార్డుతో మూర్ నటజీవితానికి పరిపూర్ణత చేకూరింది. మూర్ ఇంతకుముందు మూడుసార్లు ఆస్కార్ నామినేషన్ పొందింది. అవార్డు మూడుసార్లు మూర్‌తో దొంగాట ఆడి, ఆడి చివరకు 2015లో ఆమెను వరించింది.

ఆమెరికాలో ఉన్న గొప్ప సెన్సిబుల్ నటులలో జూలియన్ మూర్ ఒకరు. 'బూగీ నైట్స్, ది బిగ్ లెబోస్కీ, షార్ ఫ్రమ్ హెవెన్, గేమ్ ఛేంజ్' లాంటి సినిమాలలో ప్రదర్శించిన నటనను మూర్‌కి ఇప్పటికీ మరో రెండు ఆస్కార్లు లభించి ఉండాల్సింది.

హాలీవుడ్‌లో ఇటీవల వచ్చిన సినిమాలలో STILL ALICE సినిమాతో పోల్చదగిన సినిమా మైకేల్ హన్కి తీసిన AMOUR ఒక్కటే! అమోర్ కూడా 'కేన్స్'లో స్వర్ణ మయూరం అవార్డు గెలుచుకుంది.

STILL ALICE సినిమాకు ఆధారం లిసాజినోవా, STILL ALICE నవల. నవలగా పాఠకులను అది ఎంతగా ఆకట్టుకుందో, సినిమాగా కూడా ప్రేక్షకులను అంతగానూ ఆకట్టుకుంది.

డాక్టర్ ఎలైస్ హౌలేండ్‌ది అందమైన జీవితం. ఆమె ప్రసిద్ధి చెందిన కొలంబియా యూనివర్శిటీలో భాషాశాస్త్రం బోధించే అధ్యాపకురాలు. అన్నింటినీ సాధించుకున్న సంతృప్త జీవితం ఆమెది. భర్త జాన్‌హేలేండ్, లాయర్‌గా పని చేసే పెద్ద కూతురు అన్నా, సినిమా నటిగా ఎదగాలని కలలు కనే చిన్న కూతురు లిడియా, మెడిసిన్ చదివే కొడుకు, భాషా శాస్త్ర అధ్యాపకురాలిగా దేశ వ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు, దేశ విదేశాల్లో ఆమె శిష్యులు, దేవుడు సైతం అసూయపడే జీవితం ఆమెది. తన చుట్టూ వున్న ప్రపంచాన్ని శక్తివంతమూ, సౌందర్యవంతమూ చేయగల శక్తి ఆమెది.

ఎలైన్ అంత అద్భుతమయిన, అందమయిన, సున్నితమయిన సునిశిత మేధావి స్త్రీ మరొకరు లేరని భర్త ఆమె యాభైయవ పుట్టిన రోజు నాడు అందంగా ప్రశంసిస్తాడు. ఆధునిక స్త్రీ ఎలా వుండాలి అనుకుని కలలు కంటుందో అలా వుంటుంది ఎలైస్.

ఒక రోజు యూనివర్శిటీలో ఆమె పాఠం చెపుతూ ఉండగా... ఒక పదం గుర్తుకు రాక ఆమె సతమతమవుతుంది. ఎంత సేపు ప్రయత్నించినా ఆమెకు కావలసిన 'LEXICON' అనే పదం గుర్తుకు రాదు.

అది మొదటిసారి ఆమె జీవితంలో కలవర పడిన క్షణం. పాఠం ఎలాగో ముగించి వస్తుంది ఎలైస్. మరొకరోజు తను ఎప్పుడూ జాగింగ్ చేసే యూనివర్శిటీ క్యాంపస్‌లో నుండి తన ఇంటికి దారి మర్చిపోతుంది.

తనకు ఏదో అవుతున్నదని మొదటిసారి గుర్తిస్తుంది ఎలైస్. యాభై ఏళ్ళు వచ్చాయి కనుక 'మెనోపాజ్' దశకు వచ్చి వుంటుందని భావిస్తుంది. మెనోపాజ్ చిహ్నాలు తెలుసుకుందామని గూగుల్ సెర్చ్ చేస్తుంది. 'ఈస్ట్రోజోన్' హార్మోన్ లోపం వలన ఇలా జరుగుతున్నదేమో అని భావించిన ఆమె డాక్టర్‌ని కలవాలని నిర్ణయించుకుంటుంది. అప్పటికి సమస్య పరిష్కారం అయినట్లు కనిపించినా... లోలోపల ఏదో డిస్ట్రబెన్స్ ఉందని ఆమె భావిస్తూ వుంటుంది.

జీవితాంతం భాషాశాస్త్రాన్ని బోధించిన ఆమెకు పదాలు, వాటి పుట్టుక, వాటి స్వరూప స్వభావాలు లాంటి అంశాలు బోధించిన ఎలైస్, పదాలు గుర్తుక రాక మెదడంతా శూన్యం అవుతుంది. 45 నిమిషాల లెక్చర్ కోసం రెండు గంటల పాటు తయారయ్యే ఆమె, చివరి క్షణంలో ప్రిపేర్ అయింది ఏదీ గుర్తుకు రాక మూగపోతుంది.

న్యూరాలజిస్టును సంప్రదించాక ఆమెకు అసలు నిజం తెలుస్తుంది. అమెకు అరుదయిన 'అల్జీమర్స్' వ్యాధి సోకిందని. అది ప్రాథమిక దశలోనే ఉందని. అల్జీమర్స్ వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందని తెలిశాక తన పిల్లల్లో ఎవరికయినా వస్తుందేమో అనే బెంగ ఎక్కువ అవుతుంది.

పెద్ద కూతురు అన్నాకి ఇద్దరు కవలలు. పెద్ద కూతురుకి టెస్ట్ చేయిస్తే పాజిటివ్ అని వస్తుంది. మిగతా పిల్లలకి పరీక్ష చేయించటానికి భయమేసి ఆగిపోతుంది.

ఇంతకూ ఏమిటి అల్జీమర్స్. మతిమరుపు. వృద్ధాప్యంలో వయసు మీద పడటం వలన కలిగే మతిమరుపు కాదు. ఎవరికయినా ఎప్పుడయినా రావచ్చు అది. మెదడు లోపల సజీవమయిన కణాలు ఒక్కొక్కటిగా మరణిస్తుంటాయి. మెల్లమెల్లగా 'LOSS OF EVERY THING' మనిషిని తనలోకి లాక్కుంటుంది. పదాలు మర్చిపోతాం.. స్వల్పకాల సంఘటనలు గుర్తుకురాక సతమతమవుతాం. ఎదురుగా ఉన్న మనిషిని గుర్తించలేం. పదే పదే మన అస్తిత్వం గురించి ఎదుటి వారిని అడుగుతూ వుంటాం. మననుంచి మనం విడిపోయి మరో లోకంలోకి వెళ్ళిపోతాం. మన చుట్టూ ఉన్న ప్రపంచం అదృశ్యమవుతుంది.

ఎలైస్ ఎంతయినా తెలివయిన భాషాశాస్త్ర అధ్యాపకురాలు. కనుక మెదడును చురుకుగా ఉంచడానికి మెదడుపైన రకరకాల ప్రయోగాలు చేస్తుంది. వర్డ్ గేమ్స్ ఆడుతుంది. మరపును జయించడానికి తరచూ మర్చిపోయే వాటిని ఒకచోట రాసి పెట్టుకుంటుంది. వీడియో షూట్ చేస్తుంది.

ఒక దశలో నిరాశకు గురి అయిన ఆమె 'తనకు కేన్సర్ వచ్చినా బావుండేది' అని బేలగా భర్తతో అంటుంది.

అల్జీమర్స్, వ్యక్తిగా ఎలైస్ ఒక్కరి సమస్యే కాదు. అది మొత్తంగా కుటుంబానికి సంబంధించిన సమస్య. భార్యా, భర్త, పిల్లలు, మనుమలు, మనవరాళ్ళు, వాళ్ళమధ్య పెనవేసుకున్న బంధాలు, వాటి తీవ్రత వీటన్నింటికీ సంబంధించిన సమస్య.

సంబంధాలలో మార్పులకి కారణమయ్యే సమస్య, మనుషుల లోలోపల అంతర్లోకాలని పట్టి కుదిపే సమస్య.

భర్త జాన్ హౌలేండ్‌కు భార్య దగ్గరగా ఉండి ఆమెకు సపోర్ట్‌గా ఉండాలి అని వుంటుంది. సరిగ్గా అదే సమయంలో మరో ఆకర్షణీయమైన ఉద్యోగానికి అవకాశం వస్తుంది. ఎలైస్ ఉద్యోగం మానేయడంతో ఈ ఆకర్షణీయమైన ఉద్యోగంలోకి మారడం అతడికి తప్పనిసరి. అప్పుడు అతడేం చేయాలి? అతడు వెళ్ళాలని నిర్ణయించుకుంటాడు.

ఎలైస్‌లో ఫ్రస్టేషన్ మొదలవుతుంది. తనకు ఇష్టమైన అధ్యాపకం వదిలేసింది. తనకు ఇష్టమయిన జాగింగ్ చేయటం, వంట చేయటం లాంటి అంశాలకు కూడా ఇతరుల సహాయం అవసరం అవుతోంది.

తన వ్యాధి ముదరడం లేదు. యధాతథ స్థితిలో కొనసాగుతోంది అని తెలుసుకోవడం కోసం తన ఫోన్ మీద ఐదంటే ఐదు తేలికయిన ప్రశ్నలకి జవాబులు చెప్పటం కోసం ఎక్సర్‌సైజ్ చేయటం ప్రారంభిస్తుంది. అల్జీమర్స్ స్థాయి మారకుండా వుందని ఎలైస్ భ్రమపడుతున్నా ప్రేక్షకుడికి తేలికగా అర్థం అవుతుంది. ఎలైస్ పదాలని ఫ్రేమ్ చేయటానికి కష్టపడుతున్నదని.

కుటుంబంలోని ఒక బంధం తెగిపోతుంది. భర్త మరో ఉద్యోగం కోసం వెళ్ళిపోతాడు. చిన్న కూతురు లిడియా తల్లికోసం కాలిఫోర్నియా నుండి వస్తుంది. 'యాంజిల్స్ ఆఫ్ అమెరికా' అనే నాటకంలోని ఒక భాగాన్ని చదివి వినిపిస్తూ, 'యాంజిల్స్ ఆఫ్ అమెరికా' అంటే ఏమిటని తల్లిని ప్రశ్నిస్తుంది. ఎలైస్ లోలోపల పదాలను కూడబలుక్కుంటూ 'ప్రేమ' అని చెప్పాలనుకుంటుంది. అది గొంతు దాటిందా...?

ఎలైస్‌గా తన సున్నితమైన నటనతో జూలియన్ మూర్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. వోవర్ ప్లే, అండర్ ప్లే లాంటి సాంకేతిక అంశాలు ఎందుకు కానీ, ఒక్క మాటలో చెప్పాలంటే అల్జీమర్స్ పేషంట్‌గా మూర్ బిహేవ్ చేసింది. ఈ పాత్ర పోషణకి గాను మూర్ మూడు నెలల పాటు హోమ్ వర్క్ చేసింది. అల్జీమర్స్ అసోసియేషన్‌తో కలిసి పని చేసింది. వాళ్ళలో ఒకరిగా కలిసిపోయింది.

"నా అనుభవంలోకి రాని ఏ అంశాన్నీ నేను తెరమీద ప్రదర్శించలేదు" అని మూర్ ఇదే సినిమాకు గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకున్నప్పుడు చెప్పింది.

"ఎంతోమంది అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులు ఒంటరిగా వెలివేయబడినట్లుగా జీవిస్తున్నారు. వాళ్ళందరికీ ఈ సినిమా ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది" అని మూర్ ఆస్కార్ అందుకుంటూ చెప్పింది.

STILL ALICE సినిమాకు నిస్సందేహంగా జూలియన్ మూర్ ప్రాణం. సినిమాలో ఎలైస్ పాత్ర క్షీణిస్తున్నకొద్దీ, కళ్ళ వెనుక శూన్యం నింపడం ద్వారా ఆమె ఒక అద్భుతమే చేసింది.

మరీ ముఖ్యంగా ఒక సన్నివేశంలో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించి నిద్ర మాత్రలను చెల్లాచెదురుగా పడవేసినప్పుడు ఆమె అభినయం చాలా రోజుల వరకు మనలను వెంటాడుతూ వుంటుంది.

"ఇది నరకం. ఇది ఇంకా దిగజారనుంది" (this is hell and it gets worst) అని ఒక చోట ఎలైస్ అంటుంది. చీకటి రాత్రి మీద మంచుతెర కమ్మేసినట్టుగా, జూలియన్ మూర్ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ ప్రేక్షకుడిని ఆశ్చర్యాంబుధిలో పడవేస్తుంది.

తన వ్యాధి ముదరడం లేదు. యధాతథ స్థితిలో కొనసాగుతోంది అని తెలుసుకోవడం కోసం తన ఫోన్ మీద ఐదంటే ఐదు తేలికయిన ప్రశ్నలకి జవాబులు చెప్పటం కోసం ఎక్సర్‌సైజ్ చేయటం ప్రారంభిస్తుంది.

'నీకెలా వుంది?' అని లిడియా చాలాసార్లు సినిమాలో ఎలైస్‌ను అడుగుతూ వుంటుంది. ఈ సినిమా మొత్తం ఈ ప్రశ్నకి జవాబు వెతకటానికే ప్రయత్నించింది. ప్రేక్షకులకి, అల్జీమర్స్ పేషెంట్ ఎలా ఫీల్ అవుతారో చెప్పడానికి ఈ సినిమా ప్రయత్నించింది.

మాతృదేవోభవకీ, ఈ సినిమాకి వున్న ప్రధానమయిన పోలిక ఏంటంటే, సినిమా మొత్తం అండర్ కరెంట్‌గా విషాదం ఆవరించుకుని ఉండటం. ఆ విషాదం మన గుండెలని చూస్తున్నంత సేపూ మెలిపెడుతూనే వుంటుంది. తీవె తెగిన శివరంజనిలా ఎలైస్ మనల్ని వెంటాడుతుంది.

విషాదాన్ని మీటిన సౌందర్యం ఏం వుంది అసలు? 'FAR FROM HEAVEN' ఇలాంటి నటనతోనే 'మూర్' ప్రేక్షకుడిని కట్టి పడేస్తుంది.

"నేను ఉత్తమ నటిని అంటే ఒప్పుకోను. ఆస్కార్ పొందిన నా చహచరులు మేరియన్ కోటిలార్డ్ two days one night. ఫెలిసిటి జోన్స్, ద థియరీ ఆఫ్ ఎవ్రీ థింగ్ రోస్‌మండ్ పైక్ కూడా ఇలాంటి ప్రతిభనే ప్రదర్శించారు" అని వినయంగా చెప్పుకుంది ఆస్కార్ వేదిక మీద జూలియన్ మూర్.

దిచర్డ్ ద గ్లిట్జెర్, వాష్‌వెస్ట్‌మూర్ లాండ్ సంయుక్తంగా స్క్రీన్ ప్లే సమకూర్చి దర్శకత్వం వహించిన ఈ సినిమా పోటీ పడిన ఒక్క విభాగంలో అవార్డు గెల్చుకోవటం విశేషం.

కుడోస్ టు జూలియన్ మూర్

– వంశీకృష్ణ, 9573427422

■ **అలనాటి సంచిక**

స్రవంతి

ఆంధ్రకేసరి గ్రంథమాల ఐదవ పుస్తకంగా ప్రచురించినది స్రవంతి అన్న కవితా సంకలనం. వృషనామ సంవత్సరం. శ్రావణమాసం జూలై 1941 ముద్రితమైంది. ఈ సంస్థ ప్రతి సంవత్సరం కొన్ని పుస్తకాలను ప్రణాళికనను సరించి ప్రచురించనున్నట్లు ప్రకాశకుల మాటలవల్ల తెలుస్తుంది.ఇది 11 మంది కవుల 11 కవితలున్న ఈ పుస్తకం జాతిప్రబోధం, భావుకత, స్మృతి ప్రధానలక్ష్యంగా ఉన్న జాతీయోద్యమానికి అనుకూలంగా ఉన్న,జాతీయ భావాలను వివరిస్తున్న భావకవిత్వ శాఖలలోని కవిత్వం ఒక చోట చేర్చి ప్రచురించినట్లు ఇందులోని కవితలను బట్టి తెలుస్తుంది.

ఆంధ్రుడా అన్న బి.విశ్వనాథం గారి కవిత ప్రబోధాత్మకకవిత.

చూడుము నీదు తల్లియె యశోకవనంబున సీతమాడ్కియ
ల్లాడెడు నన్యరాష్ట్రముల లావుదొరంగి తదీయముక్తికై
వేడగరాద దెవ్వరిని వీరుని బోలెచరించి,నీవేయా
చేడియ బన్న ముల్విడగ జేసి తరింపుము ఆంధ్రసోదరా

అని సీత విముక్త మైనట్లు భారతమాత విముక్తం కావాలని దానికి పూనుకొమ్మని చెప్పారు.

విజయగానము పేరుతో ఏటూరి సత్యనారాయణ వ్రాసిన గేయంలో జాతివినేటట్లు విజయగీతి నాలపింపుమి మధుర గానము నాలపింపుమి కోకిలా అని పాడమన్నారు. బోయినేపల్లి రంగారావు రాణా ప్రతాపసింహుడు చారిత్రక వీరుడైన జాతినాయకుని కీర్తన. చిన్న ఖండికలో ఆయన గుణకీర్తన చేసి దాస్యవిముక్తికి అతడిలా కృషి చేయాలని బోధించారు.

సంధ్య అన్న గొబ్బూరు రామచంద్ర రావుగారి కవిత గురజాడ కన్యక శైలిలో నడిచింది.కవి ఒక స్త్రీకి కాంతుడిపై కోపమొద్దు అని చెబుతూ ఆ కాంతుడిని తన మిత్రుడిగా సంబోధించి అతనిపై కోపాన్ని వీడి స్వాగతమివ్వమని చెప్పాడు.కనక దుర్గాప్రసాద్ గారి దైవం?మతమారణ హోమాలను ఆపలేని దైవమా అని దైవాన్ని ప్రశ్నిస్తున్నాడు.గొబ్బూరు గోపాలరావు భారతదేశము రాయప్రోలు తమ్ముడా శైలిలో నడిచింది.

ఆంధ్ర దేశము భరతమాతకు
నొసట దిద్దిన తిలకమనుచును
భరతదేశపు పుణ్యభూమిని
భక్తి గొల్వుము సోదరా.

ఆహ్వానము బూర్గుల రంగనాథరావు రచన.భావకవుల ప్రాణసఖులపై ఊహాప్రమేయసులపై రాసిన కవిత్వంలా సాగింది.గేయం,పద్యం మిశ్రమంగాఈ కవితలో నడిచింది.వెలమల గోపాలరావు సంతాసం స్మృతి కవిత.వేంకటేశ్వరా, అన్న సంబోధనతో తన మిత్రుడి మరణాన్ని ఇందులో రచించారు.తెలుగుకవితా వైభవాన్ని చెప్పే కవిత అందుగుల లక్ష్మణరావు భారతి.గొప్ప కవిత్వం నవ్యకవిత్వం "భారతి" కి అక్షర నీరాజనం ఇస్తుందన్న ఆకాంక్ష ఈ కవితలో కనిపిస్తుంది.చిట్టి చంద్రుడ్మా అందుగుల తిరుమలరావు "చంద్రుడు,కేంద్రంగా జనుల భావనలను వివరించింది.మంచళ్ల సుదర్శనాచారి గాంధీమహాత్ముడు అన్న కవిత లొ గాంధీ నాయకుని,భావనలను మనమందుంచే కవిత.

స్రవంతి కవితా సంకలనం లక్ష్యం స్పష్టంగా ఇదే అని చెప్పే వీలుకన్పించదు కానీ భావకవితా శాఖలైన స్మృతి,దేశభక్తి ప్రకృతి,ప్రణయం వంటివి ఇందులో ఉండడం చూస్తే ఆధునిక కవితా రచనలో ఈ ప్రాంతకవులను,వారి కవితావైశిష్ట్యాన్ని చెప్పడం లక్ష్యంగా కనిపిస్తుంది.

- సిహెచ్.లక్ష్మణచక్రవర్తి, 9849714261

పేపర్ మీద రాయండి

పాప పేరు మీద నెలకు కనీసం వెయ్యి రూపాయలు సేవింగ్స్ అకౌంట్‌లో వేయాలని ఏడాదిగా అనుకుంటున్నాడు రమణారావు. కానీ ఇప్పటికీ బ్యాంకు అకౌంట్ తెరవలేదు. ఒకసారి బ్యాంకుకి వెళ్ళి అప్లికేషన్ తీసుకొచ్చాడు. కానీ అది ఇప్పుడు ఏ కాగితాల్లోనే కలిసిపోయింది. మధ్యలో గుర్తు వచ్చినప్పుడు వచ్చే నెల జీతం రాగానే ఆ పని చేయాలనుకుంటాడు. అంతే. ఆ పని చేయకుండానే ఏడాది గడిచింది. కావాలని కాదుగానీ వాయిదాలు వేసే స్వభావం అతని వ్యవహారసరళిలో భాగమైంది. ఇది సరికాదు. చేయాలనుకున్న పనులు చేసి తీరాలి. వాయిదాలు వేస్తుంటే వాయిదాల మీద వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతుంటాయని అతనికి తెలుసు. కానీ ఆచరణలో ఆ నైజానికి దూరంగా ఉండలేదు.

ఇలాంటి రమణారావులు మన చుట్టూరా వుంటారు. మనలోనూ వుంటారు. దీనిని అధిగమించడం తక్షణావసరం.

➽ మీరు చేయాలనుకున్న పనుల్ని ఒక కాగితం మీద రాసుకోవాలి. వీలయితే ఒక నోట్‌బుక్‌లో రాసుకోవాలి. కనీసం వారానికి ఒకసారి చూసుకోవాలి. ప్రతి గురువారం పొద్దుటే మీ నిర్ణయాల జాబితాను చెక్ చేసుకోవాలి.

➽ పోస్టాఫీసులో లేదంటే బ్యాంకులో అకౌంట్ తీయాలి. ఈ సోమవారం ఇందుకోసం ఆఫీసుకు సెలవు పెట్టండి. ఆ పని పూర్తి చేయండి.

➽ నలభై సంవత్సరాలు వచ్చినా మీ బ్లడ్ గ్రూప్ ఏమిటో మీకు తెలియదు. ఒకసారి ల్యాబ్‌కు వెళ్ళి పరీక్ష చేయించుకుంటే తెలుస్తుంది. ఈ వారంలోనో, ఈ నెలలోనో ఈ పని చేయండి.

➽ అసలు మీరు చేయాలనుకుంటున్న పనులు, చేయలేక వాయిదాలు వేస్తూ వచ్చిన పనుల గురించి ఒక జాబితా రాసుకోండి.

➽ ఆ జాబితాని పరిశీలించి, వీలయినంత త్వరగా పూర్తి చేయడానికి వీలయిన పనులేమిటో మరో కాగితం మీద రాయండి. ఆ పనులు ఎంతకాలంలో, ఎప్పుడు పూర్తి చేయగలరో కూడా కాగితం మీదనే రాయండి. ఇలా చేస్తే ఎన్నాళ్ళనుంచో వాయిదా వేస్తూ వచ్చిన పనులు పూర్తి కావడం సులువు.

■ సందర్భం

చల్లగాలులు వేడెక్కే వేళ... లేలేత చిగుళ్ళతో పూరెమ్మలతో విరబూసే చెట్ల కోలాహలంతో... కోయిలల కమ్మని రాగాల కనువిందే వసంత రాగాలతో పులకిస్తుండగా... "హోళీర రంగ హోళీ, చమకేళీర హోళీ...." అంటూ రంగుల ఆనందాల తుళ్లింతల్నీ వెంటేసుకొని వచ్చేస్తుంది హోళీ. మల్లెల సువాసనల గుబాళింపుతో వసంత ఋతువులోకి ప్రవేశించిన తర్వాత జరుపుకునే తొలి వేడుక హోళీ.

హోళి రంగుల కేళి

ప్రపంచంలోని రంగులన్నీ ఒక చోట కుప్ప పోసారా! అన్నంత అందంగా, ఆహ్లాదంగా చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా గులాములు చల్లుకుంటూ రంగునీళ్లల్లో తడిసిముద్దవుతూ కేరింతలలో తుళ్లిపడుతూ చెమ్మకేళీలు ఆడుకునే ఆనందాల హేళీ హోళీ. మన చరిత్రలో చెప్పే హోళీ కథలలో అంతరార్థం మాత్రం సౌహార్థ్రత, సౌభ్రాతృత్వం వెల్లువిరియాలనే, మానవత్వం పరిమళించాలనే సందేశం ఇంటింటా వాడవాడలా అందించే శుభ సందర్భమే ఈ హోళీ.

రంగుల అర్థం

సుఖం, దు:ఖం, సంతోషం, విచారం వీటన్నిటి మేలు కలయికే జీవితం. వీటిల్లో ఏ ఒక్కదానికో పొంగిపోవడమో లేదా కుంగిపోకుండా అన్ని సమయాలలో, అన్ని సందర్భాలలో సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో రకరకాల రంగులు కలిపిన నీటిని ఒకరిపై ఒకరు చల్లుకుంటారు. హోళీ రోజు ఒక్క రంగులకే పరిమితం కాకుండా స్నేహితులతో, బంధువులతో కలిసి ఆడతారు, పాడతారు, రోజంతా ఆనందంగా గడిపేస్తారు. సన్నిహితుల మీదే కాకుండా తెలియని వారి మీద కూడా రంగులు చల్లి కొత్త కొత్త పరిచయాలను పెంచుకుంటారు. ఈ రోజు శత్రువులు కూడా మిత్రులుగా మారిపోతుంటారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒకచోట చేర్చేదే హోలి అని చెప్పుకోవచ్చు.

రంగుల కేళీ

చలికాలం వెళ్లి వేసవి వచ్చే వేళలో వసంతరుతువుకి ఆహ్వానం పలికే సమయంలో వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల జ్వరాలు, జలుబు లాంటివి వచ్చే అవకాశం ఉంది. అవేమీ రాకుండా ఉండేందుకే వేప, బిల్వ, అత్తిపూలు, మోదుగ పూలు... వంటి ఔషధగుణాలున్న ఆకులు, పువ్వుల పొదులు లేదా పచ్చివే దంచి వాటిని పసుపు, కుంకుమలతో పాటు నీళ్లలో కలిపి ఒకరిపై ఒకరు చల్లుకునేవారు. ఈ విధంగా తయారు చేసే రంగు నీళ్లు ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది. ఎందుకంటే ఈ నీళ్ళు శరీరాన్ని చల్లబరుస్తాయి. కాని, నేడు ఆరోగ్యకరమైన సంప్రదాయం క్రమంగా రంగుల పండగగా మిగిలిపోయింది. వసంతంలో విరబూసే పూలచెట్లు క్రమంగా అంతరించిపోవడంతో కృత్రిమరంగులు ఆ స్థానాన్ని భర్తీచేశాయి. కాని ఈ కృత్రిమ రంగులను చల్లుకోవడంలో కాస్తంత జాగ్రత్త తప్పని సరి.

రంగుల కలయిక

హోళీ పండుగ రంగుల కలయిక. వివిధ రకాల రంగులను చల్లుకుంటూ చిన్నా పెద్ద అని తేడా లేకుండా ఎంతో సంతోషంతో ఆడుతూ ఉంటారు. ఈ రంగులన్ని ఒక్కసారి చూస్తే ఇంద్రధనుస్సులా మనిషిలోని గుణాలకు చిహ్నంగా ఉంటాయి. ఒకప్పుడు రంగులను సహజంగా తయారు చేసేవారు. కాని ఇప్పుడు లభించే రంగుల్లో హానికరమైన రసాయనాలు, విషపూరితమైన పదార్థాలు ఉండటం వల్ల ఈ పండగ ప్రమాదకరంగా మారింది. రంగులు కళ్ళల్లో పడితే కళ్ళుపోయే ప్రమాదం ఉంటుంది. కృత్రిమ రంగులు పడక చర్మవ్యాధులు, వివిధ రకాల ఎలర్జీలు, ఆస్మా లాంటి వాటికి గురికావలసి ఉంటుంది. కాబట్టి రంగులను ఉపయోగించేటప్పుడు జాగ్రత్తతో వ్యవహరించాలి. ముఖ్యంగా పిల్లలు వాడే రంగుల విషయంలో ఇంకా జాగ్రత్తగా ఉండాలి.

వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల జ్వరాలు, జలుబు లాంటివి రాకుండా ఉండేందుకే ఔషధగుణాలున్న ఆకులు, పువ్వుల పొదులకు పసుపు, కుంకుమలతో పాటు నీళ్లలో కలుపుతారు.

ఆరోగ్య స్పృహ పెరగడం, రంగుల్లోని విషపదార్థాల గురించి విస్తృతంగా ప్రచారం చేయడంతో కృత్రిమ రంగుల కన్నా సహజ రంగులే ఉత్తమం అంటున్నారు అందరూ. వీటిని ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు. ఎరుపు రంగు కోసం బీట్‌రూట్‌ను, పసుపు రంగు కోసం పసుపు, ఆకుపచ్చ కోసం ఆకుకూరల మిశ్రమం ఇలా సహజంగా లభించే రంగులను వాడటం వలన మనకే కాదు పర్యావరణానికి కూడా మంచిది.

తీసుకోవలసిన జాగ్రత్తలు

ఆనందానికి ప్రతీకగా జరుపుకునే హోళీ విషాదం కాకుండా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మంచిది. రంగులు చల్లుకుంటూ వాహనాల మీద స్పీడుగా వెళ్ళడం మంచిది కాదు. అలాగే, రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్ళే వారి మీద కూడా రంగులు చల్లకూడదు. ముఖ్యంగా వయోవృద్ధులు, అయిదేళ్ల లోపు పిల్లల మీద రంగులు అస్సలు చల్లకూడదు. రంగులు పూయించుకోవడం కొందరికి ఇష్టముండదు. వారి జోలికి వెళ్ళకూడదు. బలవంతంగా రంగులు పూయకూడదు.

అలాగే హోళీ ఆడటానికి వెళ్ళేముందు ఒంటినిండా కొబ్బరి నూనె రాసుకొని, పాతబట్టలు వేసుకొని బయటకు వెళ్ళాలి. మరి ఈ జాగ్రత్తలతో హోళీ రోజు రంగునీళ్ళ బాటిళ్ళతో బయటకు వెళ్ళి మధ్యాహ్నం కల్లా మొత్తం ముగించుకొని ఇంటికి చేరేసరికి ఇంట్లో అమ్మ మిమ్మల్ని చూసి ఈ రంగులను ఎలా వదిలించాలా అని అనుకుంటూ తిట్లతో, తోలు ఊడే వరకు రుద్దడం బాధగా ఉన్నా... ఇవన్నీ ఈ హోళీ సంబరాలలో సంతోషంగానే ఉంటాయి కదూ మరి ఇక ఆలస్యం ఎందుకు ప్రారంభించండి.

- నక్షత్ర

■ మన మాణిక్యాలు

రాంజీగోండు (1836-60)

గోండు వీరుడైన రాంజీగోండు నాయకత్వంలో నిర్మల్ సమీపంలోని కొండలను ఆవాసంగా చేసుకొని గోండులు, రోహిల్లాలు 1860 మార్చి, ఏప్రిల్‌లో బ్రిటీష్ సైన్యంలో సాయుధ పోరాటం చేసి వీరమరణం పొందారు. ఆదివాసీలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన ఆంగ్ల సైన్యాలు రాంజీగోండు సహా వేయి మంది గిరిజనులను బంధించి నిర్మల్ నడిబొడ్డులో ఊడలమర్రి చెట్టుకు 1860 ఏప్రిల్ 9న ఉరితీశారు. 'వెయ్యి ఉరిల మర్రిచెట్టు'గా ప్రసిద్ధి కెక్కిన ఈ వృక్షాన్ని 1995లో పాలకులు నరికివేశారు.

దొడ్డి కొమరయ్య (మరణం 4 జులై, 1946)

నల్లగొండ జిల్లా జనగామ తాలూకా (ప్రస్తుతం వరంగల్ జిల్లాలోనిది) లోని కండవెండి గ్రామంలోని గొల్లకులంలో గట్టమ్మ, కొండయ్యల నాలుగో సంతానంగా జన్మించాడు కొమురయ్య. జనగామ తాలూకా ప్రజలు విసునూరు దొర దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి, అతని తల్లి జానకమ్మ దొరసాని పాలనలో అనేక కడగండ్లు అనుభవించారు. వారి ఆగడాలకు, రజాకార్ల దురంతాలకు వ్యతిరేకంగా గ్రామ ప్రజలు తిరుగుబాటు చేసి 'గుత్పల సంగం' ఆధ్వర్యంలో 1946 జులై 4న జులూస్ లేవదీశారు. జులూస్ దొర గడీ వద్దకు రాగానే లోపల వున్న రజాకారు సైన్యాలు వారిపై కాల్పులు జరుపగా ముందు వరుసలో వున్న యువకుడైన కొమురయ్య కడుపులోకి తుపాకీ గుండు దూరి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఆ విధంగా అమరుడైన కొమురయ్య స్ఫూర్తితో ప్రజలు పోరాటం సల్పి విసునూరి దొరలను అంతమొందించారు. కడీవెండిలో అతని పేరుమీద స్మారకస్థూపం వెలసింది. హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని ఐ.ఎస్.సదన్‌లో దొడ్డి కొమురయ్య భవన్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి కె.సి.ఆర్. ప్రకటించారు.

లంబాడీ వీరులు (1940-1950)

తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లగొండ జిల్లా జనగామా, సూర్యాపేట ప్రాంతాలలోని లంబాడీ కుటుంబ వీరులు ఎందరో అమరులైనారు. జనగామ తాలూకా ధర్మాపురం గ్రామానికి చెందిన జాటో తహాము, అతని ఆరుగురు కుమారులు తమ భూములను ఆక్రమించుకొన్న భూస్వాములు పుసుకూరి రాఘవరావు, విసునూర్ దేశ్‌ముఖ్‌ల ఆగడాలకు వ్యతిరేకంగా తీవ్రమైన పోరాటం సల్పారు. కడివెండి గ్రామంలో దొరల సైన్యాలు కాల్పులు జరిపి దొడ్డి కొముర‌య్యను బలిగొన్న సందర్భంలో వీరు గ్రామ ప్రజలకు అండగా నిలిచి ధైర్యాన్ని కూడగట్టారు. ఆ ప్రోత్సాహంతోనే గ్రామప్రజలు దొరల గూండాలకు తగిన శాస్తి చేశారు. పోలీసులు, గూండాలు లంబాడీ కుటుంబాలను మట్టు బెట్టాలని జూసినా వారు చివరి క్షణం వరకు వీర యోధులుగా నిలిచారు. జాటోతహామూ నాయక్ కుమారుల్లో పెద్ద వాడైన జోద్యానాయక్, మూడవవాడైన సక్రునాయక్ జైలు పాలై చిత్ర హింసలు అనుభవించారు. 1948లో పోలీసు చర్య తర్వాత కూడా మిలిటరీ సైన్యం వీళ్ళ కుటుంబంపై దాడి చేసింది. ఐదవ వాడైన ధర్మానాయక్‌ను అరెస్ట్ చేసి మరణదండన విధించారు. వీరిలో గొప్ప వీరుడైన 4వ కుమారుడు ఠానూ నాయక్‌ను రామవరం దేశ్‌ముఖ్ కతారు నరసింహారావు బండికి కట్టించి ముక్కలై పోయేవరకు ఈడ్చిచంపారు. అట్లా ఠానూ నాయక్ 1950లో వీరమరణం పొందాడు.

సూర్యాపేట తాలూకా వల్లభాపురం గ్రామానికి చెందిన మరొకర్ని లంబాడీ కుటుంబాలు ఈ వీరోచిత పోరాటంలో ముఖ్యపాత్ర వహించాయి. భీమ్లానాయక్, వచ్యానాయక్ వీరులను సైన్యం కాల్చి చంపింది. ఆరుట్ల రామచంద్రారెడ్డితో కలిసి పోరాటం సల్పిన ధారవత్ భాంగ్య, ధారవత్ పంతుల్, ధారవత్ సంగ్య కూడా అమరులైనారు. కొండాపురం తండాకు చెందిన హేమ్లా నాయక్, కోలుకొండ గుట్ట తండాకు చెందినవారు కూడా ఎందరో చిత్రహింసలకు గురియైనారు.

- ఎస్.వి.రామారావు

జోక్స్ కార్నర్

అలవాటులో పొరపాటు

గిరి : కండక్టర్ కూతుర్ని పెళ్ళి చేసుకుని మోస పోయానురా.

హరి : ఏమయిందిరా?

గిరి : కట్నంలో సగం ఇప్పుడిచ్చి మిగతాది తర్వాత ఇస్తానని పెళ్ళి శుభలేక వెనకాల రాసి ఇచ్చాడు.

క్రికెట్ పిచ్చి

గోపి : ఇంతకు ముందు మీ నాన్నగారి పేరు రామారావు అని చెప్పావుగా. మరి భీమారావుగా పేరు ఎప్పుడు మార్చుకున్నారు?

కృష్ణ : బీమా పాలసీ ఏజెంటా మారినప్పటి నుండి.

చెప్పకూడదు

బిక్షగాడు : బాబూ ధర్మం చెయ్యండయ్యా

దారినపోయే దానయ్య : ఈ వృత్తిలో రోజుకు ఎంత సంపాదిస్తున్నావేంటి?

బిక్షగాడు : క్షమించండి... ఆడవారి వయసు, మగవారి సంపాదన చెప్పకూడదంటారు పెద్దలు.

చనిపోతే ఉద్యోగం

నర్స్ : మా హాస్పటల్లో ఆపరేషన్ ఫెయిలయ్యి పేషెంట్ చనిపోతే, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇస్తారు మా డాక్టరు గారు.

కొత్త పేషెంట్ : అందుకేనా ఇంత చిన్న హాస్పటలైనా వందల మంది ఉద్యోగులేంటా అని వచ్చినప్పటి నుండి బుర్ర బద్దలు కొట్టుకుంటున్నా.

కె.ఎక్స్.రాజు

గైడ్ చేయాల్సిన బాధ్యత పెద్దలదే!

నేటి సాంకేతిక ప్రపంచంలో ఇంటర్నెట్ క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా నేటి తరం ఇంటర్నెట్‌పై పూర్తిగా ఆధారపడి బ్రతుకుతోంది. భవిష్యత్ తరాల్లోనూ ఇంటర్నెట్ వినియోగం మరింత కీలకంగా మారనుంది. ఈ నేపధ్యంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కంప్యూటర్, ఇంటర్నెట్ వ్యవస్థను ఏ వయసు నుంచి అందుబాటులో ఉంచాలి..?, పిల్లలను చిన్నతనం నుంచే ఇంటర్నెట్‌కు చేరువచేయడం వల్ల లాభమా నష్టమా..? అసలు చిన్నారులకు ఇంటర్నెట్ అవసరమా..? వంటి అనేక ప్రశ్నలు ముందుకొస్తున్నాయి. వాస్తవానికి, పూర్తిస్థాయి పర్యవేక్షణతో కంప్యూటర్, ఇంటర్నెట్ వంటి సాధనాలను తల్లిదండ్రులు వారివారి చిన్నారులకు చేరువచేసినట్లయితే వారి పై అద్భుతంగా ప్రభావం చూపుతాయని నిపుణులు అంటున్నారు. ఇంటర్నెట్‌లో చిన్నారులకు ఉపయోగపడే బోలెడంత ఆసక్తికర సమాచారం దాగి ఉంది. అయితే దాన్ని ఎలా ఉపయోగించేకోవాలన్నదే ప్రశ్న. స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరగడంతో ఇంటర్నెట్ వినియోగమూ గణనీయంగా పెరిగింది. ఒక్క భారతదేశంలోనే మొబైల్ ఇంటర్నెట్ వినియోగం 2014 డిసెంబర్ నాటికి 173 మిలియన్లుగా వుంటే, జూన్ 2015నాటికి 213మిలియన్లకు చేరుతుందని లెక్కలు చెబుతున్నాయి.

ఇంటర్నెట్ పదునైన రెండంచుల ఖడ్గం వంటిది. దాన్ని ఉపయోగించడంలో ఏమాత్రం బ్యాలెన్స్ తప్పినా అది ప్రతికూల ప్రభావాలకు దారితీసే అవకాశం వుంటుంది. ఇంటర్నెట్‌ను సరైన దిశలో ఉపయోగించుకునే విధంగా పిల్లలను గైడ్ చేయాల్సిన బాధ్యత పెద్దలదే. ఎంత సమయం వాడాలి, ఏ సైట్లు చూడాలి, ఏ సైట్ల వల్ల ఎంత ఉపయోగం అనేది వారికి తెలియజెప్పాలి. లేదంటే అమూల్యమైన సమయంతో పాటు పిల్లలు తమ భవిష్యత్‌ను కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఇంటర్నెట్‌కు బానిసలుగా మారితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఈ విషయాన్ని అనేకమంది నిపుణులు అనేకసార్లు చెప్పారు, చెపుబుతూనే వున్నారు. అయినా కొన్ని దుష్పరిణామాలు జరుగుతూనే వున్నాయి. ఇంటర్నెట్‌కు బానిసైన ఓ యువకుడు తన చెయ్యిని కోసుకున్న ఘటన చైనాలోని జియాంగ్జు ప్రాంతంలో జరిగింది. వాంగ్ అనే 19 ఏళ్ల యువకుడు ఇంటర్నెట్‌కు బానిసగా మారిపోయాడు. ఈ అలవాటు ఎలాగైనా వదిలించుకోవాలని కూరగాయలు తరిగే కత్తితో తన ఎడమ చేతిని కోసుకున్నాడు. ఒకసారి ఏదైనా అలవాటుకు బానిసైతే, దాన్ని వదిలించుకోడానికి ఎంత మూల్యం చెల్లించాలో ఈ సంఘటన రుజువు చేస్తోంది. వాస్తవానికి చైనాలో నెట్ వాడకం అంటువ్యాధిలా వ్యాపించింది. 2.4 కోట్ల మంది దీనికి బానిసలయ్యారు. ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడటం, బ్రౌజింగ్ లాంటి విషయాల్లో చైనా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. ఇంటర్నెట్ వ్యసనం నుంచి బయట పడేసేందుకు దేశంలో చాలా ప్రాంతాల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేసినా ఫలితం మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇదో ఉదాహరణ మాత్రమే. ఇలాంటివి దాదాపు అన్ని దేశాల్లోనూ జరుగుతూనే వున్నాయి.

ప్రయోజనాలు :

* పూర్వ కాలంలో వివిధ దేశాల చరిత్రను తెలుసుకోవాలంటే పుస్తకాలు, మ్యాప్‌లను ఆశ్రయించాల్సి వచ్చేంది. కానీ ఇప్పుడు ప్రపంచ దేశాలనే కాదు ఆయా దేశాల్లోని గ్రామాలను కూడా ఇంటర్నెట్ ద్వారా వీక్షించగలుగుతున్నాం. ఈ విధమైన సమాచారం చిన్నారులకు ఆసక్తికరంగానూ, విజ్ఞానదాయకంగానూ ఉంటుంది.

* పిల్లలు తమ సబ్జెక్ట్‌కు సంబంధించిన ప్రాజెక్టులను, ఇతర ముఖ్యమైన వివరాలను ఇంటర్నెట్ సెర్చ్ ఇంజన్ల సహాయంతో సులభంగా పొందవచ్చు. ఇది ఇప్పటి విద్యార్థులకు అందుబాటులో ఉన్న అద్భుతమైన సాధనం.

* ప్రపంచవ్యాప్తంగా ఉన్న అతిపెద్ద రహదారులు, రైల్వే లైన్లు, భవనాలు ఇలా అనేకమైన ఇంజినీరింగ్ అద్భుతాలకు సంబంధించిన అంశాలను ఇంటర్నెట్ మనకు చేరువస్తుంది. ఈ విధమైన సమాచారం చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడటమే కాకుండా వారికి మార్గదర్శిగా నిలుస్తుంది.

* భౌగోళిక స్థితిగతులు, సముద్రాల లోతుల్లోని జీవరాశుల గురించి తెలుసుకోవడంతో పాటు వివిధ రకాల నదులు, అడవులు, జంతువులు, వివిధ దేశాల ప్రజల జీవన విధానం వంటి అనేక రకాల ప్రశ్నలకు ఇంటర్నెట్‌లో సమాచారం దొరుకుతుంది. ఇది పిల్లలకు ఎంతో ఉపయోగకరం.

* ఇంటర్నెట్ ఓ విజ్ఞాన బాండాగారం. ఎటువంటి ప్రశ్నకైనా సమాధానం ఇట్టే దొరకుతుంది. చిన్నారులకు అవసరమైన వివరమైన సమాచారాన్ని ఛాయా చిత్రాలు ఇంకా వీడియోల రూపంలోనూ సేకరించవచ్చు.

* వినోదం, విజ్ఞానాన్ని చేరువ చేసే ఆసక్తికరమైన ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ గేమ్స్ సైతం ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వివిధ సబ్జెక్టుల పాఠ్యాంశాలు వీడియో ఇంకా ఆడియో రూపంలో ఇంటర్నెట్‌లో అందుబాటులోకి వచ్చేసాయి. ఇవి చిన్నారుల మేధస్సుకు మరింత పదును పెట్టేందుకు ఉపకరిస్తాయి.

నష్టాలు :

* లక్షలాది పోర్న్ సైట్‌లకు వేదికగా నిలుస్తున్న ఇంటర్నెట్ యువత భవిష్యత్‌ను నాశనం చేస్తోంది. చైనా, సౌదీ ఆరేబియా వంటి దేశాల్లో పోర్న్ వెబ్‌సైట్‌లపై కొంత నియంత్రణ వుంది. ఈ వెబ్‌సైట్‌లపై నియంత్రణ లేని ఇండియా వంటి దేశాల్లో ఈ జాఢ్యం మరింత ముదిరిపోతోంది.

* పోర్న్ వెబ్‌సైట్‌లు నేటి యువతరంలో బలాత్కార ధోరణిని, విచ్చలవిడి తనాన్ని అలవరుస్తున్నాయని మానసిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో విస్తరిస్తున్న విష సంస్కృతులలో 'సెక్స్‌టింగ్' ఒకటి. అశ్లీల, అసభ్యకర సందేశాలను సెల్‌ఫోన్ ద్వారా మిత్రులతో షేర్ చేసుకోవటాన్ని సెక్స్‌టింగ్ అంటారు. ఈ విష సంస్కృతి రోజు రోజుకు విస్తరిస్తోందని అనేక సర్వేలూ చెబుతున్నాయి. దీని ఉచ్చులో పడి పిల్లలు పాడవకుండా ఉండటానికి తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందే.

* ఆన్‌లైన్ మిత్రులతో పిల్లలు జరిపే చాటింగ్‌పై ఓ కన్నేసి ఉంచాలి. పిసి, ల్యాప్‌టాప్‌లను అందరూ చూసే విధంగా హాల్లో ఉంచాలి. అంతేగాకుండా ఆన్‌లైన్‌లో పిల్లలు చూస్తున్న వెబ్‌సైట్‌లకు సంబంధించిన వివరాలను హిస్టరీ ఆప్షన్‌లోకి వెళ్లి తెలుసుకోవాలి. పిల్లలు ఉపయోగిస్తున్న కంప్యూటర్‌కు స్పైవేర్‌ను ఇన్‌స్టాల్ చేసి వారు ఏ సైట్లలోకి వెళ్తున్నారో గమనిస్తుండాలి. సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్‌ల ద్వారా మీ చిన్నారులు పంపిస్తున్న సందేశాలపైనా ఓ కన్నేసి ఉంచాలి.

ఇలాంటి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఇంటర్నెట్ అనే మాయా ప్రపంచంలో కూరుకుపోకుండా పిల్లలను కాపాడుకోవచ్చు. అదే సందర్భంలో ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న విజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు బాటలు వేసినవారవుతారు.

రచయిత సెల్ : 9490099219



విత్తనంలోకి చూసే పెద్దచెట్టు

మళ్లీ విత్తనంలోకి, ఎన్.గోపి, పేజీలు : 114, వెల : 150/-, ప్రతులకు : ఎన్.అరుణ, ఇం.నెం.13-1/5బి, శ్రీనివాసపురం, రామాంతపూర్, హైదరాబాద్-13.

గోపీగారి అలుపెరుగని సాహితీ ప్రస్థానంలో ఆకుపచ్చగా మొలిచిన మరో కావ్యం 'మళ్లీ విత్తనంలోకి'.

నిరంతరం తన అడుగులు వెనుదిరిగి చూడనీయని ఈ సాహితీ కృషీవలుడు మూలాల్లోకి చూసుకుని పునర్వికాసం చెందడం ఒక అపూర్వమైన విషయం. షేక్స్పియర్ సమస్త సాహిత్యాన్ని నడిపించింది రెండే అంశాలట. ఒకటి తను పుట్టి పెరిగిన ఊరు, రెండు తాను ప్రస్తుతం జీవిస్తున్న పట్టణం. జీవితం ఎంత పట్టణీకరణ పొందుతున్నా చిన్నప్పటి ఉపాధ్యాయున్ని, మూడు రాళ్ళ పొయ్యిని, దండాన్ని, చిలుక్కొయ్యని, సదా గుండెను మీటే రామగిరి స్టేషన్ని, పిల్లబాటల్ని అలా నడిపించిన సమస్త సాహిత్య ప్రతిపాదికలను తలచుకొని ఒక పునరుత్పత్తి సంకేతమైన విత్తులోకి వెడతాన్ని ప్రకటించడం సమాంతరంలో తనను మరింత నిటారుగా, విశిష్టంగా నిలబడడానికి దోహదం చేసే ప్రక్రియ.

గోపీ సార్ పదాల్లో సారళ్యం వుంటుంది. తెల్లగా నవ్వే లేత కొబ్బరి లాగా స్వచ్ఛంగా తడితడిగా తగిలే తమలపాకుల్లాగా మనల్ని అలరిస్తాయి. గోపీసార్ పదాల్లో కాఠిన్యమూ ఉంది. అంటే రూపానికి సంబంధించి కాదు. ఏవో మహా ప్రాణాలను ప్రయోగించి పారకీయతకు అడ్డు పడుతుండడమూ కాదు. ఒక అర్ధ గాంభీర్యము చదివిన కొద్దీ మనలని ఏదో తెలియని జీవన వాస్తవికతలోనికి తీసుకెళ్ళి వదిలే లోకానుభవం మనకు తెలియకుండానే తెలుస్తుంది.

ఇప్పుడు కవిత్వంలో ఆధునికానంతర కాలపు అస్పష్టత తగ్గిపోయింది. సంక్లిష్ట కవిత్వం శరవేగంగా వచ్చిన ఉద్యమ కవిత్వంలో కలిసిపోయి తనను జీవితీకరించుకున్నది. అయితే తమ ఆదర్శాలను ఆమడ దూరంలో ఉంచే సామాజికత మీద అసంతృప్తి కొనసాగడమూ అసంతృప్తి నుండి క్లిష్టత కవిత్వంలోకి ప్రవేశించడమూ ఓ పాయగా ఇప్పుడూ కొనసాగడం ఉండుగాక. కాని ఇది ప్రధానమైన మార్గమైతే కాదు. కవి యొక్క అనుభవ పరిధి, ప్రపంచ సాహిత్యంతో కవికున్న అనుబంధం, తనకున్న స్థానిక, ప్రాపంచిక దృక్పథాన్ని బట్టి కవితా వ్యూహం ఏర్పడుతుంది. ఆ క్రమంలో గోపీ సార్ రాజకీయ నాయకులు చేసే మోసపు పాదయాత్రలు నిరసిస్తున్నారు. విశ్వవిద్యాలయాలలోని సెమినార్ల కృత్రిమత్వాన్ని గుర్తు చేస్తున్నారు. ఒక మనిషి మానవత్వం వదిలేసి ఎలా అయ్యాడో చెబుతున్నారు. ఆర్ట్స్ కాలేజీ స్మృతులను నెమరేసుకున్నారు.

గోపీసార్ కవిత్వంలో కేకలు పోరాటాలు ఎక్కడా కనిపించవు. అలాగని సామాజిక క్రౌర్యాన్ని అతికించిన దయ లోపల దాగిన కాఠిన్యాన్ని, వంచననూ వదలిపెట్టరు. నినాద కవిత్వం కంటె నిరసన కవిత్వం, మానవత్వపు గుబాళింపు ఉన్న కవిత్వమే ఎక్కువ ప్రభావితం చేస్తుందనడానికి గోపీసార్ కవిత్వం ఒక నిలువెత్తు ఉదాహరణ. మానవ సంబంధాల ఉన్నతీకరణ ఈ కవిత్వం లక్ష్యప్రాయం.

ఆయన చేతిలో సామాన్య వస్తువు కూడా ఎంత కవిత్వీకరణ పొందుతుందో చూడండి.

రోజూ రవిబింబాన్ని
కిరీటంగా ధరిచే వైభవముంది
చంద్రవంకను సిగలో చిక్కుకుని
కాసేపు శివుడిలా
మురిసిపోయే సరదా ఉంది

కొండకు గర్వం కూడదు. నాముందు మనిషెంత అని ఛీత్కరించడం తగదు అనే సాధారణ వాక్యాలతో మొదలయ్యే ఈ కవిత క్రమంగా ఎంతో చక్కని అభివ్యక్తిని సంతరించుకుంది. ఏ మార్మికత ప్రతీకలు లేనట్టుండే ఈ కవిత, కొండ, దాని ఎత్తు అనే లక్షణం, అన్ని వైభవాలున్నా అది కదలలేదని గుర్తు చేయడం కొండను మానవీకరిస్తూ సృష్టిలోని సమతుల్యత మన ముందుంచారని గమనించాలి.

ఏమైనా ఈ కావ్యం తెలంగాణ రాష్ట్ర సాహిత్య సమాజానికి ఒక గొప్ప కానుక. తెలుగు ప్రజలందరికీ ఆత్మీయ కరచాలనం.

- డా॥కాంచనపల్లి, 9676096614

గిరిజనోద్యమాల అవగాహన



తెలంగాణలో గిరిజనులు - తిరుగుబాట్లు
రచన: ప్రొ॥ రాందాస్ రూపావత్
పేజీలు: 84, వెల: రూ. 60
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు

అడవుల్లో నివసించే గిరిజనులకు అడవుల మీద హక్కుల్ని నిరాకరించినప్పట్నించి తిరుగుబాట్లు, పోరాటాలు అనివార్యమయ్యాయి. ఈనాటికీ గిరిజనోద్యమాలు జరగడానికి ఇదే కారణం. ప్రొ॥ రాందాస్ రూపావత్ రచించిన పుస్తకం 'తెలంగాణలో గిరిజనులు - తిరుగుబాట్లు' పుస్తకం చదివితే ఆదివాసీల పోరాటానికి సంబంధించిన గత చరిత్ర, వర్తమాన పరిస్థితులు బోధపడతాయి. ఈ పుస్తకంలో అయిదు అధ్యాయాలున్నాయి. స్వాతంత్ర్యానికి ముందు ఉన్న గిరిజనోద్యమాలు ఏమిటో ఒక అధ్యాయంలో వివరించారు. తెలంగాణలోని గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల గురించి మరో అధ్యాయం ఉంది. ఇవాళ తెలంగాణలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, అందునా భూసమస్యలు ఏమిటో మరో అధ్యాయంలో చర్చించారు. గిరిజనుల భూముల్ని ఇతరులు ఆక్రమించుకోవడం వల్ల తలెత్తిన ఆందోళనలు, ఉద్యమాల గురించి అరో అధ్యాయంలో వివరించారు. ఈవిధంగా తెలంగాణలో గిరిజనుల పోరాటచరిత్రను అవగాహన చేసుకోడానికి ఉపయోగపడే పుస్తకమిది. ఒక ప్రణాళిక ప్రకారం పుస్తకం రచించిన పద్ధతి బాగుంది.

- కె.పి.



మహాసభల అలనాటి చరిత్ర

సిపిఐ(ఎం) మహాసభల చరిత్ర, పేజీలు: 248, వెల: రూ. 175
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 21వ మహాసభలు ఏప్రిల్‌లో విశాఖలో జరగనున్నాయి. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) మహాసభల చరిత్రని తెలియజేసే పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించింది. కమ్యూనిస్టుపార్టీ మహాసభల కీలక నిర్ణయాలు, ఆ సభల నాటి రాజకీయ పరిస్థితులు, సభల్లో ఆమోదించిన విశిష్టమైన తీర్మానాల గురించి తెలియజేసే పుస్తకమిది. 'సిపిఐ(ఎం) మహాసభల చరిత్ర 1 నుండి 20వరకు' అనే శీర్షికతో వచ్చిన ఈ పుస్తకం మలయాళ మూలం బాబుజాన్, ఆంగ్లానువాదం డా. డి.జయదేవదాస్, పి.పి.సత్యన్. తెలుగులోకి ఫాతిమా అనువాదం చేశారు. అసలు మహాసభల ప్రాధాన్యం ఏమిటన్నది ముందుమాటలో ప్రకాశ్ కరత్ వివరించారు. మహాసభల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోడానికి ఉపకరించే ముందుమాట ఇది. ఐక్యపార్టీ వరుసక్రమంలో ఏడవదైన మొదటి సిపిఐ(ఎం) మహాసభ 1964లో జరిగింది. పార్టీ ఏర్పడిన గత అయిదు దశాబ్దాల కాలంలోని పరిణామాల్ని అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం చదవాలి. ఎలాంటి కాలాల, రాజకీయ పరిణామాల నేపథ్యంలోంచి తనదైన స్థానాన్ని నిలుపుకుంటూ పార్టీ పురోగమిస్తుందో తెలుసుకోడానికి ఈ పుస్తకం ఒక కరదీపికలా ఉపయోగపడుతుంది.

అనేకానేక సవాళ్ళను ఎదుర్కొంటూ ముందుకు తీసుకుపోవడంలో పార్టీ నాయకత్వం అనుసరించిన పద్ధతులు, ఎత్తుగడలు, వ్యూహాలు, సందర్భానుసారంగా తీసుకున్న రాజకీయ నిర్ణయాలు, వాటిపై నిర్వహించిన సమీక్షలు ఒక పద్ధతి ప్రకారం ఈ పుస్తకంలో అందించారు. ఆయా కాలాల్లో ఏయే నాయకులు ఉన్నారో, పార్టీకి నాయకత్వం వహించి ముందుకు నడిపించారో తెలుసుకోవడం ఆసక్తికరంగా వుంటుంది. రాజకీయ పరిణామాల చరిత్రను తెలుసుకోవాలనుకునేవారు, రాజనీతిశాస్త్ర విద్యార్థులు ఈ పుస్తకాన్ని చదవడం ఉపయుక్తం.



మార్క్సిజమే ఏకైక ప్రత్యామ్నాయం

50 ఏళ్ల సిపిఐ (ఎం), ఆశయాల బాటలో అర్ధ శతాబ్దం
పేజీలు: 40, వెల: రూ. 25, ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

మార్క్సిజం వెలుగులో ఆశయ సాధనకోసం, సిద్ధాంతానికి కట్టుబడి అయిదు దశాబ్దాలుగా పనిచేస్తున్న సిపిఐ(ఎం) చరిత్రను, పురోగమనాన్ని అవలోకించే వ్యాసాల సంపుటి '50 ఏళ్ల సిపిఐ(ఎం) ఆశయాల బాటలో అర్ధ శతాబ్దం'. దీనిలో ప్రకాశ్ కరత్, సీతారాం ఏచూరి, వి.శ్రీనివాసరావు రాసిన వ్యాసాలున్నాయి. గత చరిత్రనీ, వర్తమానాన్నీ విశ్లేషిస్తూ పార్టీ రాజకీయ పంథాని అర్థం చేసుకోడానికి ఉపకరిస్తుందీ పుస్తకం. మార్క్సిజం ప్రాసంగికతను కోల్పోవడం కాదు, గత ఆరేడేళ్ళ పరిణామాల్లో ఈ ప్రాసంగికత మరింత పెరిగిందని సీతారాం ఏచూరి చెబుతున్న మాటలు అక్షరసత్యం. మార్క్సిజం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదన్నది వాస్తవం. కనుక మార్క్సిజం వెలుగులో మానవాళి సంపూర్ణ సమగ్ర విముక్తి సాధనకు పోరాడటం అవసరం. ఈ పోరాటానికి నాయకత్వం వహించే పార్టీగా సిపిఐ(ఎం) నిర్వహిస్తున్న పాత్రని ఆకళింపు చేసుకోడానికి ఈ పుస్తకంలోని మూడు వ్యాసాలు ఉపకరిస్తాయి.

- కె.పి.అశోక్‌కుమార్

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటి రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-500020.

నాకు నచ్చిన పుస్తకం

వెలుగు దివ్వెలు



సామాజిక ఇతి వృత్తాలను స్పృశిస్తూ భైతి దుర్గయ్య కలం నుంచి జాలువారిన 32 కవితల సమాహారమైన 'అక్షరసేద్యం' పుస్తకం నన్ను విశేషంగా ప్రభావితం చేసింది. దేశానికి అన్నమందించే రైతుల జీవన పరిస్థితులను 'అన్నదాత' కవిత ద్వారా వారి ఆర్తనాదాలు వినిపించారు. అంతరించి పోతున్న కులవృత్తులను 'మసకబారిన వెలుగు దివ్వెలు' ద్వారా చక్కగా వర్ణించారు. మారుతున్న గ్రామీణ పోకడలకు ఊరు మారింది. దర్పణంగా నిలిచింది. అబలలపై పెరుగు తున్న అరాచకాలను 'ఆత్మ ఘోష' ద్వారా తెలియజేశారు. అవినీతి గ్రస్త భారతాన్ని రక్షించడానికి గాంధీని ఉద్దేశిస్తూ 'మహాత్మా మళ్ళీ జన్మించు' కవిత ద్వారా రచయిత మన ఆవేదన వ్యక్త పరిచారు. దిగ జారి పోతున్న మానవ విలువలకు ఆదర్శంగా 'మానవత్వం', 'ముళ్ళ బాటలు' కవితలో కనిపిస్తాయి. గొల్లకుర్మల జీవనాన్ని ప్రతిబింబించే 'గొంగడి గోస' అనే కవిత పుస్తకానికే తలమానికం. యువతరాన్ని జాగృత పరిచేలా వివేకానంద కవితలు రాసినారు. గురు దేవతలకు దక్షిణంగా 'గురుదేవ నీకు వందనం', 'సామాన్యుడి ఆక్రోశం' సమాజ మార్పుకు సంకేతంగా రచయిత చాలా బాగా చెప్పారు. చదివిన కొద్దీ మళ్ళీ చదవాలని పించే విధంగా రాశారు. ఈ పుస్తకం ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యల గురించి చర్చిస్తుంది. నిజంగా ఇది అక్షర సేద్యమే.

- ఎల్. ఆంజనేయులు,
తడ్కపల్లి, సిద్దిపేట

■ ఈ వారం కవిత్వం

అడివి బిడ్డను మాట్లాడుతున్నా...

మా అంతర్ముఖత్వపు పొదిరింటిని వొదిలి
కొండల గుండెల పొరలను చీల్చుకొని
ఆదీవాసీ నగ్న పౌరునిగా బహిర్గతమవుతాను
నా ఆయుధాన్ని ఆత్మగౌరవ పతాకంలా
గిరిజన సమూహాల స్వర ఘోషై ఎలుగెత్తాను...

నీచ ప్రయోగాల పుట్టలైన మీతలలు
మేధోవికృతత్వానికి గర్విస్తూ
ముంపును మా బతుకుల్లోకి మళ్ళించి
నన్ను బలవన్మరణం పాలైనా కమ్మంటారు
బానిసగానైనా మారిపొమ్మంటారు...

ఆధునిక అభివృద్ధి పథం!
నాగరికులకు లాభించే గొప్పవరం!
మా తెగలను తుడిచిపెట్టే శాపం!
అయితే విను అంతిమ వేదనాశృతిలో
అట్టుడికే మా అసమ్మతి ఘోషను...

మీ సాంకేతిక పారిశ్రామిక ప్రగతినుద్దేశించి
రెడ్ ఇండియన్ల నాయకుడు సీటెల్
గొంతులోంచి మాట్లాడుతున్నా
నల్లజాతి వీరుల నాలుకల్లోని నరమై
మరుగుతున్న రక్తం చిమ్ముతున్నా...

సంకెళ్ళు తెంచుకున్న స్పార్టకస్
కుత్తుకలోంచి పౌరుషాగ్నినై మాట్లాడుతున్నా
బిర్సాముండా బిగుసుకున్న పిడికిలినై
యుద్ధం ప్రకటిస్తున్నా
అల్లూరి గంటందొరల గర్జనలను
అడివి పొలిమేరలు దాటి వినిపిస్తున్నా
రాంజీగోండు కొమురం భీమ్‌ల
రణ నినాదమై దూసుకొస్తున్నా
సోమంగంగులు సొసంత్రపు సోయితో



తెగిపడ్డ తలనైనా ఆలోచించమంటున్నా...

మా జాతుల్ని కన్నీటి యజ్ఞంలో
జల సమాధి చేయ తల పెట్టొద్దని
భారీ నీటి ప్రాజెక్టుల పేరుతో
ప్రాకృతిక సంపదల్ని సహజవనరుల్నీ
విధ్వంసించడం మానుకొమ్మని సూచిస్తున్నా...

అయినా నీవు మాగోడు
వినే శక్తిని కోల్పోయుంటే
నీ చూపులు మందగించి మత్తెక్కి ఉంటే
నీ దృష్టిని మహామాయ కమ్ముకుంటే
నీ అధికార బలిమి అదే పనిగా
జులుం చెలాయించమంటుంటే
ఉక్కుడేగా! ఉక్కుడేగా!
ఇక నేను చేయాల్సింది అదే...

అడివంతా అల్లుకున్న ఉద్యమతీగనై
ఎదుగుతూ సాచుకుపోవడమే
జల్! జంగల్! జమీన్!ల అస్త్రమై
విల్లును ఎక్కుపెట్టడమే...

సర్వం కోల్పోనున్న విషాదవనంలో
చివరి తెగింపుతో యుద్ధానికి సన్నద్ధమై
వింటి నారిని మీటడమే
నాడూ నేడూ ఎప్పుడూ
భూమీ భుక్తీ విముక్తి పాటలమై
పోటెత్తుతూ నదుల్లా ప్రవహించడమే
'రుద్రమకోట'లోంచి నిరసన
ఖడ్గాలను దుయ్యడమే...

(కాకతి సామ్రాజ్ఞి రుద్రమదేవి వేసవి విడిదిగా చెప్పబడే ప్రాంతం 'రుద్రమకోట' కుక్కునూరు మండలం, ఖమ్మం జిల్లాలో వున్నది)

– అనిశెట్టి రజిత, 9849482462

ఆశ్రమవాసి

బుడి బుడి అడుగుల నడకలు చూస్తూ
పాలపుంతలా వెలిగిపోయిన అమ్మా
రోజులు జారుతున్న కొద్దీ
పుస్తకాల సంచిని
ప్రేమ నిండిన కళ్ళతో మోసిన అమ్మా
ప్రతి అక్షరానికి
కదలికనిచ్చే ప్రాణశక్తి అమ్మా.
దు:ఖాల్ని రాల్చుకుంటూ
వెన్నెల మీగడల్ని పంచిన అమ్మా
ఆప్యాయత సమీరాల్ని వీచి
దిశా నిర్దేశంతో వేలవేల కథల్ని
వినిపిస్తూ వికసింప చేసిన అమ్మా
రెక్కలు విచ్చుకున్న పక్షులు ఇప్పుడు
అలా చేరని తీరాలకి పోయాయి
కలలన్నీ విరిగిపోయి
దిక్కులేని అనాథ పక్షిని చేశాయి
అనాథ ఆశ్రమంలో
స్వగతంలా నిలిచి
కన్న పిలుపు కోసం నాల్గు దిక్కులు తొలిచి
ఆశగా చూస్తున్న అమ్మా
పేగు బంధం మరచి
వాసనలేని కరెన్సీల మధ్య
యాంత్రికంగా జీవిస్తున్న
నీ పిల్లలకి
జ్ఞానోదయం కావాలని ప్రార్థిస్తున్నావా!
దెబ్బ తగిలితే గతం మెదిలితే
నువ్వెప్పుడూ తళుక్కున గుర్తొస్తావ్!
తడిగల హృదయం వెతుక్కుంటూ
నిన్ను అక్కున చేర్చుకుంటుంది.
బిక్కు బిక్కుమన్న బతుకులో
వెలుగు దివ్వెలు చూస్తావ్
మనో ధైర్యంతో
ఆఖరి మజిలీని కొనసాగిస్తున్నావా అమ్మా!
క్షణాల్ని భారంగా
నడిపిస్తున్నావా అమ్మా!

– గడివి శ్రీనివాస్, 08886174458



గ్రహంబెల్ తన కుటుంబ వ్యక్తులతో
సంభాషించడానికి కనిపెట్టిన యంత్రం
ఇప్పుడు మన జీవితంలో అతి
ముఖ్యమైన భాగం (కొందరికి
శరీరంలోనే ముఖ్యభాగం అన్నట్టుగా
కూడా వుంది) అయిపోయింది. అది
లేకుండా పూట గడవడం లేదు.
ఇప్పుడైతే రకరకాలుగా అర చేతిలో
ఇమిడిపోయే సెల్‌ఫోన్లు, టాబ్‌లు
వచ్చాయి కానీ మొదట్లో ఉన్న ఫోన్లన్నీ
రీసీవర్‌తో మాట్లాడేవి, ఇంట్లో మాత్రమే
పెట్టుకోగలిగినవి. ఎన్ని రకాల,
అందమైన ఫోన్లు
ఉన్నాయో చూడండి.



అతి చిన్న బీచ్

సముద్ర నీటి ఒడ్డునే బీచ్ అనేట్టయితే దీన్ని కచ్చితంగా బీచ్ అనే పిలవాలి. అయితే ఇది చాలా చిన్నగా వుంటుంది. ఈ బుల్లి బీచ్ ఎక్కడ ఉందో తెలుసా? మెక్సికోలోని నయారిట్ తీరంలో. అక్కడ అసలు బీచ్ ఉందని కూడా చాలా మందికి తెలియదు. సముద్రపు ఒడ్డు కోతకు గురై కాల క్రమేణా అది ఓ గుహలా ఏర్పడింది. అందులోకి సముద్రపు నీరు ఓ పక్కనుండి చేరడం వల్ల బీచ్ రూపురేఖలు వచ్చాయి. ఇప్పుడిప్పుడే ఈ ప్రాంతానికి టూరిస్టులు రావడం మొదలుపెట్టారు.